మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త



ఎసిపికి పట్టుబడిన షరీఫ్‌చాంద్ భాషా

## ఎసిబి వలలో ట్రాన్స్‌కో డిఈ

**మెదక్ టౌన్, అక్టోబరు 30, ప్రభాతవార్త:** మెదక్ జిల్లా ట్రాన్స్‌కో కార్యాలయంలో సంగారెడ్డి ఏసీబీ అధికారులు రైడ్‌చేయగా డీఈ షేక్ షరీఫ్ చాంద్ భాషా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. పాపన్నపేట మండలం సీతానగరం గ్రామానికి చెందిన వ్యక్తి కొత్త పౌల్ట్రీఫారం ఏర్పాటు చేసుకోగా అందుకు విద్యుత్ కనెక్షన్‌కు డీఈ షరీఫ్ చాంద్‌భాషా నలభై వేల రూపాయలు డిమాండ్ చేయగా 30 వేలు ఇవ్వడానికి ఒప్పందం కుదిరినది. ముందుగా తొమ్మిది వేలు చెల్లించారు. గురువారం 21 వేల రూపాయలు లంచం ఇస్తుండగా ఎసిబి అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు.

## నష్టపోయిన రైతులను ఆదుకోవాలి : సిపి ఐ జిల్లా కార్యదర్శి మంద పవన్

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

మొంథా తుఫాన్‌తో కురిసిన భారీ వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని... ఇళ్ళు కూలిపోయిన బాధితులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్ ప్రభుత్వానికి, జిల్లా అధికార యంత్రాగానికి విన్నవించారు. గురువారం ఆయన సిద్దిపేటలో విలేకరులతో మాట్లాడారు. తుఫాన్ కారణంగా కురిసిన భారీ వర్షాలతో పంటలకు, కూరగాయ తోటలకు తీరని నష్టం వాటిల్లిందన్నారు. అలాగే లోతట్టు ప్రాంతాలు జలమయం కావడంతో పాటు రోడ్లు, మురికి కాల్వలు పూర్తిగా దెబ్బతినడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. భారీ వర్షాలతో చేతి కందిన వరి, పత్తి తదితర పంటలు పూర్తిగా దెబ్బతినడంతో రైతులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. నష్టపోయిన పంటను పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక అందించి నష్టపరిహారం అందేలా అధికారులు తగు చర్యలు తీసుకోవాలన్నారు. నష్టపోయిన రైతులకు సిఎం పర్యటనలో తక్షణ సహాయం అందించాలన్నారు. వర్షాలతో దెబ్బతిన్నరోడ్లు, మురికికాల్వలకు వెంటనే మరమ్మతులు చేపట్టాలన్నారు. పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేల నష్టపరిహారం చెల్లించాలన్నారు.



హుస్నాబాద్‌లో కొట్టుకుపోతున్న ధాన్యాన్ని పరిశీలిస్తున్న సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి , తదితరులు

### తడిసి, కొట్టుకుపోయిన ధాన్యం వివరాలను

## ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం

### సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి

**హుస్నాబాద్ రూరల్, అక్టోబరు 30 ప్రభాతవార్త :** మొంథా తుపాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షానికి హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో ధాన్యం కొట్టుకుపోయింది. ఈ సందర్భంగా గురువారం జిల్లా కలెక్టర్ హైమావతి హుస్నాబాద్‌లోని మార్కెట్ యార్డుల్లోని ధాన్యాన్ని అధికారులతో కలిసి పరిశీలించారు. కుండపోత వర్షానికి పోతారం నుంచి సుమారు 3 కిలోమీటర్ల వరకు వరద నీరు గోదాంలోకి రావడంతో ధాన్యం తడవడంతోపాటు కొట్టుకుపోవడం జరిగిందని, వెంటనే ఆర్డీఓ రామ్మూర్తి, మార్కెటింగ్ అధికారులను అప్రమత్తం చేసి మార్కెట్ ప్రహరీ గోడను 2 మీటర్ల పొడవు తొలగించి నీటిని తొలగించడం జరిగిందని చెప్పారు. పోతారం గ్రామం నుంచి 3 కిలోమీటర్ల నుండి మార్కెట్ గోదాం లోని వెనక ప్రహరీ గోడ కింది భాగంలో గోదం నీరు బయటకి వెళ్లే మార్గం నుండి వరద గోదాం లోపలికి రావడంతో గోదాంలో నీరు చేరి ధాన్యం పూర్తిగా నానడం, కొట్టుకుపోవడం జరిగిందని తెలియగానే ఆర్డీఓ రామ్మూర్తి, మార్కెటింగ్ అధికారులు అప్రమత్తం చేసి మార్కెట్ ప్రహరీ గోడను 2 మీటర్ల పొడవు పూర్తిగా తొలగించడం జరిగిందని, దానివల్ల నీరు బయటికి వెళ్లిందన్నారు. గోదాంలో ఉన్న 1500 క్వింటాళ్ల ధాన్యం కొట్టుకుపోవడం జరిగిందని ప్రాథమిక సమాచారం మేరకు తెలిసిందని, వెంటనే మార్కెటింగ్ అధికారులు తడిసిన, కొట్టుకుపోయిన, మొలకెత్తిన ధాన్యం వివరాలు నమోదు చెయ్యాలని ఆదేశించారు. ఈ వివరాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని చెప్పారు. రైతులు తడిసిన ధాన్యాన్ని ఆరబోసుకోవాలని తేమ తగ్గినవెంటనే గన్నిలలో నింపితే కొట్టుకుపోకుండా ఉం టుందని తెలిపారు. వాతావరణ శాఖ మొంథా తుపాన్ ప్రభావం గూర్చి కొన్ని రోజులుగా ప్రచార మాధ్యమాల ద్వారా సమాచారం చేరవేశామన్నారు. రైతులు హార్వెస్టింగ్ చేసి వెంటనే మార్కెట్ గోదాంకి తీసుకురావడం వలన ఆర బెట్టడానికి చాలా రోజుల పడుతుందని రైతులు వ్యవసాయ వ్యవసాయ క్షేత్రా లలో ఆరబోసి తేమశాతం రాగానే గోదాంకి తీసుకు రావాలని జిల్లా రైతులకు సూచించారు. మార్కెట్ యార్డులో ఆరబోసిన పది ట్రిప్పుల ధాన్యం డ్రైనేజీ లో కొట్టుకుపోయిందని ఆవేదన వ్యక్తంచేస్తూ అక్కడే ఉన్న మహిళా రైతు తారవ్వ కలెక్టర్ కాళ్లపై పడి బోరున విలపించింది. కలెక్టర్ వెంట ఆర్డీవో రామ్మూర్తి, డీఎం మార్కెటింగ్ నాగరాజు, సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, ఆయా శాఖల అధికారులు, రైతులు ఉన్నారు.

### రిపబ్లిక్ డే పరేడ్ క్యాంప్‌కు ఎంపికైన అంకిత

**ములుగు, అక్టోబరు 30 (ప్రభాతవార్త):** గుజరాత్‌లోని పటాన్‌లో ఈ నెల 31వ తేదీ నుండి నవంబరు 9వ తేదీ వరకు హేమచంద్రచార్య నార్త్ గుజరాత్ విశ్వవిద్యాలయంలో జరుగనున్న రిపబ్లిక్ డే పరేడ్ క్యాంప్‌కు ములుగు మండలం క్షీరసాగర్‌లోని హంస హోమియోపతి వైద్య కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ వాలంటీర్ అంకిత ఎంపిక కావడం జరిగిందని ఆ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఉమేష్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని అంకిత మాట్లాడుతూ రిపబ్లిక్ డే పరేడ్ క్యాంప్‌కు తాను ఎంపిక కావడం చాలా సంతోషంగా ఉందన్నారు. తన ఎంపికకు తోడ్పాటునందించిన కళాశాల డైరెక్టర్లు డాక్టర్ ఉమేష్, డాక్టర్ పద్మజా, ప్రిన్సిపాల్ డాక్టర్ నూరున్‌సహేర్‌ఖాన్, వైస్ ప్రిన్సిపాల్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాస్, కత్తి బాబు, ఫ్యాకల్టీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

### అనుమతులు లేని ఒకేషనల్ జూనియర్ కళాశాలకు నోటీసులు : డిఐఈఓ గోవింద్ రామ్

**సంగారెడ్డి మున్సిపాలిటీ అక్టోబరు 30, ప్రభాతవార్త :** సంగారెడ్డిలోని శాంతినగర్‌లోగల వికాస్ ఒకేషనల్ జూనియర్ కళాశాలకు ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేవని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి గోవింద్‌రామ్ గురువారం తెలిపారు. గురువారం ఆయన కళాశాలను సందర్శించి కళాశాల గేటుకు నోటీసు అంటించారు. కళాశాలకు ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేనందున విద్యార్థుల తల్లిదండ్రులు ఈ కళాశాలలో తమ పిల్లలను చేర్పించవద్దని ఎవరైనా చేర్పిస్తే రాష్ట్ర ఇంటర్మీడియట్ బోర్డు గాని, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కార్యాలయం గాని బాధ్యత వహించేదని ఆయన పేర్కొన్నారు.

### నీటి ఉధృతికి కొట్టుకుపోయిన దంపతులు
### కుటుంబాన్ని పరామర్శించిన జిల్లా కలెక్టర్ హైమావతి

**అక్కన్నపేట, అక్టోబరు 30, ప్రభాతవార్త :** మండల పరిధిలోని మోత్కులపల్లి గ్రామం వద్ద లోలెవెల్ కల్వర్టు వద్ద మోత్కులపల్లి వాగులో ప్రణయ్, కల్పన దంపతులు ద్విచక్ర వాహనంపై వెళుతూ నీటి ఉధృతికి కొట్టుకుపోయిన ప్రాంతాన్ని అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ హైమావతి గురువారం పరిశీలించారు. ద్విచక్ర వాహనం వాగులో కొంతదూరం వెళ్లి చిక్కుకున్న ప్రాంతాన్ని కలెక్టర్ పరిశీలించారు. బాధిత కుటుంబీకులను ఓదార్చారు. గల్లంతైనవారి అచూకి తెలుసుకోవడానికి ఎస్డిఆర్ఎఫ్ బృందాలను తెప్పిస్తున్నామని ఆ బృందాలు మల్లంపల్లి చెరువుకు చేరుకొని గాలింపు చర్యలు చేపడతాయని తెలిపారు. కార్యక్రమాన్ని పర్యవేక్షించాలని హుస్నాబాద్ ఆర్డీఓ రామ్మూర్తిని ఆదేశించారు.

**ఘటన స్థలాన్ని పరిశీలించిన సీపీ విజయ్‌కుమార్**

అక్కన్నపేట మండలం మోత్కులపల్లి వాగులో భార్య, భర్తలు ఇద్దరూ కొట్టుకుపోయినా ఘటన స్థలాన్ని సిద్దిపేట పోలీసు కమిషనర్ ఎస్.ఎం. విజయ్‌కుమార్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈసందర్భంగా వాగులో కొట్టుకుపోయిన వారి ఆచూకి తెలుసుకోవడానికి రెస్క్యూ టీం అధికారులను గాలింపు చర్యలు ముమ్మరం చేయాలని ఆదేశించారు. హుస్నాబాద్ మార్కెట్ యార్డులో తడిసిన, కొట్టుకుపోయిన ధాన్యాన్ని పరిశీలించారు. ఈనెల 31న హుస్నాబాద్ పట్టణంతో పాటు పరిసర ప్రాంతాలను సిఎం రేవంత్‌రెడ్డి ఏరియల్ సర్వే చేయనుండడంతో అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయనన వెంట అడిషనల్ డిసిపి అడ్మిన్ కుశాల్కర్, ఎసిపి సదానందం, సీఐ శ్రీనివాస్, కిరణ్, ఎస్ఐ లక్ష్మారెడ్డి తదితరులు ఉన్నారు.



బాధిత కుటుంబీకులు పరామర్శిస్తున్న కలెక్టర్

# అతలాకుతలం చేసిన 'మొంథా'

*** వేలాది ఎకరాల్లో వరి, పత్తి పంటలకు నష్టం * తెగిన రోడ్లు.. పొంగుతున్న చెరువులు, కుంటలు**



**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

మొంథా తుఫాన్ కారణంగా జిల్లాలో కురిసిన భారీ వర్షంతో పంటలకు తీరని నష్టం వాటిల్లింది. చెరువులు, కుంటలు మరోసారి పొంగిపొర్లుతున్నాయి. హుస్నాబాద్, అక్కన్నపేట, నంగునూర్, చిన్నకోడూరు మండలాల్లోని వివిధ గ్రామాల్లో అత్యధికంగా వర్షం కురిసింది. మార్కెట్ యార్డులకు, కొనుగోలు కేంద్రాలకు అమ్మడానికి తీసుకవచ్చిన వరి, మొక్కజొన్న పూర్తిగా తడిసిపోయింది. కొన్నిచోట్ల ధాన్యం రైతులు టార్పాలిన్ కవర్లు కప్పినా ఫలితం లేకుండా నీటిలో కొట్టుకుపోయింది. అలాగే వరి, పత్తి పంటలతోపాటు కూరగాయల తోటలు నేలకొరగడంతో రైతులు అన్నమో రామచంద్రా అంటూ నెత్తినోరుకొట్టుకుంటున్నారు. హుస్నాబాద్ పట్టణంలో 30.4 సె.మీ వర్షం కురిసింది. అలాగే అక్కన్నపేట మండలం కట్కూర్‌లో 28.2సె.మీ. గండిపల్లిలో 22.7సె.మీ. నంగునూర్ లో 21.4 సె.మీ, మద్దూరు మండలం రెబర్తిలో 21.0 సె.మీ. చిన్నకోడూరు మండలం పెద్దకోడూరులో 20.8 సె.మీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లాలో 2515 ఎకరాలలో పంటలకు తీరని నష్టం వాటిల్లినట్లు అధికారులు ప్రాథమిక అంచనా వేసినట్లు సమాచారం. 2.214 ఎకరాలలో 1436 మంది రైతుల వరి పంటకు నష్టం జరిగినట్లు సమాచారం. 301 ఎకరాలలో 230 మంది రైతులకు చెందిన పత్తి పంట, కూరగాయల తోటలు నష్టపోయినట్లు అధికారులు ప్రాథమిక అంచనా వేసినట్లు తెలుస్తోంది. దీనికితోడు రోడ్లు దెబ్బతిన్నాయి. మొత్తం మీద మొంథా తుఫాన్ జిల్లాను అతలాకుతలం చేయడంతో రైతులు, ప్రజలు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. కాగా అక్కన్నపేట మండలం మోత్కులపల్లి వాగు ఉధృతికి బైక్‌పై వెళ్తున్న దంపతులు ప్రణయ్, కల్పన గల్లంతయ్యారు. ఆచూకి కోసం ఎన్‌డిఆర్ఎఫ్ బృందాలు గాలింపు చర్యలు చేపట్టారు.

**నేడు హుస్నాబాద్‌లో సిఎం ఏరియల్ సర్వే...**

గతంలో ఎన్నడూ లేని విధంగా హుస్నాబాద్ పట్టణంతో పాటు హుస్నాబాద్ ప్రాంతంలో మొంథా తుఫాన్‌తో భారీ వర్షం కురిసింది. అత్యంత భారీ వర్షం 30.4 సెంటీ మీటర్ల వర్షం కురిసింది. దీంతో పంటలకు తీరని నష్టం జరిగింది. మార్కెట్ యార్డులకు, కొనుగోలు కేంద్రాలకు తెచ్చిన వరి, మొక్కజొన్న ధాన్యం తడిసిపోవడంతో పాటు వరద నీటిలో కొట్టుకుపోయింది. దీంతో సిఎం రేవంత్‌రెడ్డి ఈ నెల 31న హుస్నాబాద్‌లో ఏరియల్ సర్వే చేయనున్నారు. సిఎం రేవంత్‌రెడ్డి ఏరియల్ సర్వే చేసే ప్రాంతాలను సీపీ విజయ్‌కుమార్ పరిశీలించారు. సిఎం రేవంత్‌రెడ్డి ఏరియల్ సర్వే చేయనుండడంతో పోలీసు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.



## రావి ఆకుపై ఉక్కుమనిషి చిత్రాలు

**నారాయణఖేడ్, అక్టోబరు 30 ప్రభాతవార్త :** స్వతంత్ర భారత తొలి ఉప ప్రధాని తొలి హోం మంత్రిగా దేశాన్ని ఏక ఖండంగా తీర్చిదిద్ది మనలో సమైక్య స్ఫూర్తిని నింపిన సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతిని జాతీయ సమైక్యత దినోత్సవంగా జరుపుకుంటున్న సందర్భంగా ప్రత్యేకంగా అశ్వత్థ పత్రాలపై ఉక్కుమనిషి చిత్రాలతో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి శుభాకాంక్షలు తెలియజేస్తూ..

## నేడు జగదేవ్‌పూర్‌లో 2కె రన్

**జగదేవ్‌పూర్, అక్టోబరు 30 (ప్రభాతవార్త):**

మండల కేంద్రంలో ఈనెల 31 తేదీ శుక్రవారం సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా ఉదయం 6 గంటలకు గొల్లపల్లి ఎక్స్ రోడ్డు వద్ద 2కె రన్ ఫర్ యూనిటీ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని జగదేవ్‌పూర్ ఎస్ఐ కృష్ణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రన్ ఫర్ యూనిటీలో మండలంలోని ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# సిజె గవాయ్‌పై దాడి జరిగితే కేసు నమోదు చేయరా?

**ఎంఆర్‌పిఎస్ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ**



మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

**సంగారెడ్డి బ్యూరో, అక్టోబరు 30 ప్రభాతవార్త :**

దేశ రాజధానిలో, అత్యున్నత న్యాయవ్యవస్థ సుప్రీంకోర్టులో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయ్ మీద దాడి జరిగితే కేసులు ఎందుకు నమోదు చేయడంలేదని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పద్మశ్రీ మంద కృష్ణమాదిగ ప్రశ్నించారు. గురువారం సంగారెడ్డిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అనేక విషయాలపై స్పందించే మానవ హక్కుల కమిషన్‌కు మౌనం ఎందుకని కోర్టులో దాడి జరిగినా కంటెంట్ ఆఫ్ కోర్టు, కోర్టు ధిక్కరణ కింద శిక్షలు ఎందుకు పడవని మంద కృష్ణ మాదిగ అన్నారు. సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ స్థానంలో ఉన్న దళితుడికే రక్షణ లేకపోతే దేశంలో సామాన్య దళితులకు రక్షణ ఎలా ఉంటుందని ప్రశ్నించారు. దాడి జరిగి నేటికి 20 రోజుల గడుస్తున్నా ఇప్పటికీ కేసు నమోదు చేయకపోవడం దారుణమన్నారు. జస్టిస్ గవాయ్ స్థానంలో ఉన్నత కులాలకు చెందిన జడ్జి ఉంటే కేసు నమోదు చేయడంలో ఇలా నిరక్ష్యం చేసి ఉండేవారా? అని ప్రశ్నించారు. జస్టిస్ బిఆర్ గవాయ్ మీద జరిగిన దాడి దళితులపైన, న్యాయ వ్యవస్థ, రాజ్యాంగ స్ఫూర్తిపై జరిగిన దాడిగా చూస్తున్నామని చెప్పారు. తక్షణమే దాడి ఘటన మీద కేసు నమోదు, నిందితుడిని అరెస్టు చేసి జైలులో పెట్టాలని తెలిపారు. అలాగే ఈ ఘటనపై సుప్రీంకోర్టు రిటైర్డు జడ్జీ చేత విచారణ జరిపించి దీని వెనుక ఉన్న శక్తులను గుర్తించాలని డిమాండ్ చేశారు. విషయంలో న్యాయాన్ని కోరుతూ నవంబర్ 1న లక్షలాది మందితో ఛలో హైదరాబాద్ పేరుతో దళితుల ఆత్మగౌరవ ర్యాలీ నిర్వహిస్తామని, కులాలు, మతాలు, పార్టీలతో సంబంధం లేకుండా పెద్ద ఎత్తున ప్రజలు తరలి రావాలని పిలుపునిచ్చారు. నవంబర్ 1న బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం నుండి సెక్రటేరియట్ పక్కకున్న పెద్ద అంబేద్కర్ విగ్రహం వరకు దళితుల ఆత్మగౌరవ నిరసన ప్రదర్శన మహా ర్యాలీ జరుగుతుందని మందకృష్ణ మాదిగ అన్నారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు మైసగళ్ల బుచ్చేంద్ర మాదిగ, రామారావు శ్రీనివాస్, వీఎస్ రాజు మాదిగ, పెద్ద గీత మాదిగ, అబ్రహం, దేవరంపల్లి అశోక్ మాదిగ, నల్లోల్ల ప్రవీణ్‌కుమార్ మాదిగ వెలమల ప్రమోద్‌మాదిగ, రామ్‌చందర్, ముక్కగళ్ళ కవిత మాదిగ తదితరులు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎసిపి రవీందర్‌రెడ్డి

## ఆర్‌ఎంపి డాక్టర్‌ను బెదిరించిన వ్యక్తుల అరెస్ట్

### వివరాలు వెల్లడించిన ఎసిపి రవీందర్‌రెడ్డి

**దుబ్బాక, (అక్బర్‌పేట భూంపల్లి), అక్టోబర్ 30, ప్రభాతవార్త :**

చట్టాన్ని ఎవరు అతిక్రమించినా ఉపేక్షించేది లేదని సిద్దిపేట జిల్లా ఏసిపి రవీందర్‌రెడ్డి తెలిపారు. గురువారం దుబ్బాక సర్కిల్ కార్యాలయంలో సిఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించడం జరిగింది. భూంపల్లి మండలం రుద్రారం గ్రామంలో ఆర్‌ఎంపి డాక్టర్‌ను బెదిరించిన ముగ్గురు వ్యక్తులను పట్టుకొని మీడియా ముందు ఉంచారు. ఈ సందర్భంగా ఎసిపి రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ మాస్కులు ధరించి ఆర్‌ఎంపి డాక్టర్‌ను బెదిరించిన సంఘటన రెండు రోజుల క్రితం అక్బర్ పేట భూంపల్లి మండల పరిధిలోని రుద్రారం గ్రామంలో జరిగింది. బాధితుడు ఫిర్యాదు మేరకు సిపి ఆదేశాల మేరకు దర్యాప్తు చేపట్టగా దుబ్బాక సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో భూంపల్లి ఎస్సై హరీష్, మిడిదొడ్డి ఎస్సై, సిబ్బంది అందరూ ఈ కేసును చేదించడం జరిగింది. దీంట్లో భాగంగా ఈరోజు బిక్షపతి, బ్రహ్మం నర్సింలు ఎలియాస్ కమలాకర్, ఆర్‌ఎంపీ డాక్టర్ నరేందర్‌రెడ్డిని అరెస్ట్ చేయడం జరిగింది. వీరి నుండి తుపాకీ, బుల్లెట్స్, బైక్, సైకిల్, హెల్మెట్, సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకోవడం జరిగింది. నేరస్తులు గతంలో మిడిదొడ్డి మండలంలోని పలు గ్రామాల్లో భూమి పంచాయతీలలో ఇన్వాల్వ్ వై పొజిషన్ డిస్టర్బ్ చేయడానికిగాని వారి పాతిన కడియలు విరగగొట్టడానికిగాని బెదిరింపులకు పాటుపడడానికి కేసులలో ఇన్వాల్వ్ అయి ఉన్నారు దీనికి సంబంధించిన కేసులలో ఇప్పటికే అరెస్టయి జైలుకెళ్లారు.

## పెద్దశంకరంపేటలో డీజిల్ దొంగల అరెస్ట్

**పెద్దశంకరంపేట, అక్టోబరు 30, ప్రభాతవార్త :**

పెద్దశంకరంపేటలో ముగ్గురు డీజిల్ దొంగలను అరెస్టు చేసినట్లు అల్లాదుర్గం సీఐ రేణుకరెడ్డి తెలిపారు. వివరాల్లోకి వెళితే.. బుధవారం సాయంత్రం ఎస్సై ప్రవీణ్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు మండల పరిధిలోని చీలపల్లి బ్రిడ్జి వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో ఒక కారును ఆపి తనిఖీ చేయగా అందులో 30 లీటర్ల ఖాళీ డబ్బాలు 6, ముగ్గురు వ్యక్తులు ఉన్నారు. కారులో ఉన్న వనపర్తి జిల్లాకు చెందిన రాహుల్ మహబూబ్నగర్ జిల్లాకు చెందిన తోకల నాగరాజు. కామారెడ్డి జిల్లాకు చెందిన కురుమ గణేష్ ముగ్గురు పొంతన లేని సమాధానాలు చెప్పడంతో వారిని పోలీస్ స్టేషన్కు తరలించి విచారించగా డీజిల్ దొంగతనాలను ఒప్పుకున్నట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల సమాచారం మేరకు వీరు ముగ్గురు కూకట్‌పల్లిలో నివాసం ఉంటూ ఆటో డ్రైవింగ్ చేస్తూ. కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని పేర్కొన్నారు. వీటి వల్ల వచ్చే డబ్బులు వారి జల్సాలకు సరిపోకపోవడం వల్ల దొంగతనాలు చేయాలని ముగ్గురు నిర్ణయించుకున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. వీరికి బోరబండ కు చెందిన అన్వర్ పరిచయం కావడంతో డీజిల్ దొంగతనం చేయ్యడ ప్రారంభించారన్నారు. వీరు ఒక కారును అద్దెకు తీసుకొని రోడ్డు పక్కన పార్కు చేసిన లారీల నుంచి డీజిల్ దొంగతనం చేసి అన్వర్‌కు అమ్మి వచ్చిన డబ్బులతో జల్సాలు చేయడం ప్రారంభించారని తెలిపారు. ఈనెల 22వ తేదీన అవుటర్ రింగ్ రోడ్డు, జోగిపేట ప్రాంతంలో, నిజాంపేటలలో దొంగలించిన డీజిల్‌ను అన్వర్‌కు అమ్మినట్లు తెలిపారు. అదేవిధంగా ఈనెల 25వ తేదీన పెద్దశంకరంపేటకు వచ్చి చర్చి కాంపౌండ్‌లో ఉన్న నారాగౌడ్‌కు చెందిన టిప్పర్ల నుండి ఆరు డబ్బాలలో 150 లీటర్ల డీజిల్‌ను, గోదాంకు ఉన్న తాళాన్ని పగలగొట్టి అందులో ఉన్న ఒక పాత బ్యాటరీ, లారీ జాక్‌లను దొంగలించి డీజిల్‌ను బోరబండకు చెందిన అన్వర్‌కు అమ్మినట్లు తెలిపారు. వీరినుండి లారీ జాక్, బ్యాటరీలను స్వాధీనం చేసుకొని ముగ్గురు డీజిల్ దొంగలు అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించామని, నాలుగో వ్యక్తి అన్వర్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.



వివరాలను వెల్లడిసుతన్న అల్లాదుర్గం సిఐ రేణుకరెడ్డి, ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి

## మద్యానికి బానిసై యువకుడు ఆత్మహత్య

**వర్గల్, అక్టోబరు 30 (ప్రభాతవార్త):** మద్యానికి బానిసైన యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన వర్గల్ మండలం మీనాజిపేట గ్రామంలో గురువారం జరిగింది. గౌరారం ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి కథనం ప్రకారం... మీనాజిపేట గ్రామానికి చెందిన కందుకూరి కిష్టమ్మ, బాలయ్య కుమారుడు కందుకూరి నాగరాజు(26) పనిచేయకుండా మద్యానికి బానిసై తరచూ తల్లిని డబ్బులు ఇవ్వమని వేధించేవాడు. ఈ క్రమంలో గురువారం ఉదయం తల్లిని రూ.5 వేలు ఇవ్వమని అడుగగా లేవని చెప్పడంతో గొడవపడ్డాడు. మధ్యాహ్నం 1 గంటల సమయంలో ఇంట్లోని సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న గౌరారం పోలీసులు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుని తల్లి కిష్టమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపారు.

## చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

**కంగ్టి, అక్టోబరు 30 ప్రభాతవార్త :** రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. వివరాలు.. కంగ్టి మండలం సుక్కలతీర్థ్ గ్రామానికి చెందిన మేత్రి లక్ష్మణ్(52) మంగళవారం సాయంత్రం బైక్‌పై వస్తుండగా ఎదురుగా వచ్చిన వాహనం ఢీ కొనడంతో అపస్మారక స్థితిలో వెళ్లాడు. దాంతో హైదరాబాద్ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు

## విద్యుత్ షాక్‌తో పాడి గేదె మృతి

**దుబ్బాక, (అక్బర్‌పేట భూంపల్లి), అక్టోబర్ 30, ప్రభాతవార్త :**

విద్యుత్ షాక్ తగిలి పాడి గేదే మృతి చెందిన సంఘటన అక్బర్‌పేట భూంపల్లి మండలం చిన్న నిజాంపేట గ్రామంలో గురువారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఉన్నాయి. గ్రామానికిచెందిన షేర్ల సునీత శ్రీనివాస్ కుటుంబం పాడి గేదెపై ఆధారపడి జీవించే వాళ్లని తెలిపారు. పాడి గేదె ఇచ్చిన పాలతో తమ కుటుంబాన్ని పోషించుకునే వారు. తమ వ్యవసాయం పొలం వద్ద పాడి గేదె మేస్తున్న క్రమంలో ట్రాన్స్ఫారం వద్ద విద్యుత్ షాక్ తగిలి గేదె అక్కడికక్కడే మృతి చెందడం జరిగింది. వీరి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.



మృతి చెందిన పాడి గేదె

# హుస్నాబాద్ ప్రాంతంలో భారీ వర్షం

**వేలాది ఎకరాల్లో వరి, పత్తి పంటలకు నష్టం.. చేతికందిన పంటలు కళ్లముందే నేలకొరగడంతో ఆవేదనలో రైతులు**



వరి పొలంలో ఇసుక మేటలు వేసిన దృశ్యం



హుస్నాబాద్ మార్కెట్ యార్డులో వరద నీటిలో కొట్టుకుపోయిన ధాన్యం

**హుస్నాబాద్ రూరల్, అక్టోబరు 30, ప్రభాతవార్త:**

మొంథా తుఫాన్ హుస్నాబాద్ ప్రాంతంలో బీభత్సం సృష్టించింది. మంగళవారం రాత్రి నుంచి కురిసిన అతి భారీ వర్షం కురిసింది. హుస్నాబాద్ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రికార్డు స్థాయిలో 30 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. హుస్నాబాద్ పట్టణంలోని ప్రధాన రహదారులు, లోతట్టు ప్రాంతాలు పూర్తిగా జలమయమయ్యాయి. ఇండ్లు, దుకాణాలలోకి వరద నీరు వచ్చి చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అక్కన్నపేట మండలంలో 26 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. కోహెడ మండలంలోని పిల్లివాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో తంగళ్లపల్లి శనిగరం మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. పోరెడ్డిపల్లి, అక్కన్నపల్లి మధ్య సైతం రాకపోకలు నిలిచిపోయాయి. హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో టార్పాలిన్ కవర్లు కప్పిన ధాన్యపు రాసులు కొట్టుకుపోయాయి. వేలఎకరాల్లో వరి, పత్తి పంటలు నీటి మునిగి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. వరి పొలాల్లో ఇసుక మేటలు వేయడంతో తీరని నష్టం జరిగింది. చేతికందిన వరి పంట, పత్తి పంటలు కళ్లముందే పనికి రాకుండా నేలకొరగడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 1983లో కురిసిన భారీ వర్షం మళ్లీ ఇప్పుడు పడిందని ప్రజలు తెలిపారు.

## ఓ.యూ బిసి విద్యార్థి దీక్షకు హై కోర్టు అడ్వకేట్స్ మద్దతు



దీక్షకు మద్దతు తెలుపుతున్నట్లు వాల్‌పోస్టర్లు చూపిస్తున్న న్యాయవాదులు

**తార్నాక, అక్టోబర్ 30 ప్రభాతవార్త :** ఓ.యూలో జరుగనున్న బీసీ విద్యార్థి దీక్షకు తెలంగాణ హై కోర్టు అడ్వకేట్స్ మద్దతు తెలుపుతున్నట్లు జేఏసీ చైర్మెన్ కొమ్మనబోయిన సైదులు యాదవ్ పేర్కొన్నారు. 42 శాతం రిజర్వేషన్ల సాధనకై నవంబర్ 4వ తేది నుంచి 8వ తేది వరకు ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆవరణంలో జరుగనున్న బీసీ విద్యార్థి దీక్ష కార్యక్రమనికి సంబందించి రూపొందించిన పోస్టర్లను గురువారం తెలంగాణ రాష్ట్ర హైకోర్ట్ అడ్వకేట్స్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చాలాకని వెంకట్ యాదవ్, అడ్వకేట్ విప్లవ్ కుమార్ మాట్లాడుతూ 42 శాతం రిజర్వేషన్ల కోసం విద్యార్థులు చేస్తున్న పోరాటానికి న్యాయవాదులుగా పూర్తి మద్దతు ఇస్తున్నామని ప్రతిఒక్క బీసీ సబ్బండ వర్గాలు మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో లా స్టూడెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు గణేష్, బీసీ విద్యార్థి జేఏసీ చైర్మెన్ కొమ్మనబోయిన సైదులు యాదవ్,బీసీ విద్యార్థి జేఏసీ అధ్యక్షులు చేరాల వంశీ,బీసీ విద్యార్థి జేఏసీ వర్కింగ్ ప్రెసిడెంట్లు మామిండ్ల రవికుమార్,బీసీ విద్యార్థి జేఏసీ రాష్ట్ర అధికార ప్రతినిధి నూకల మధు,రమేష్ మరియు తదితరులు పాల్గొన్నారు.

## రమణాచారి హరే శ్రీనివాస...పుస్తక పరిచయం : తెలంగాణ సాహిత్య అకాడమీ

**రవీంద్రభారతి, అక్టోబరు 30 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర సాహిత్య అకాడమీ ప్రతిష్టాత్మకంగా నిర్విరామంగా నిర్వహిస్తున్న సాహిత్యవారంలో విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. కె.వి.రమణాచారి రచించిన హరే శ్రీనివాస... పుస్తక పరిచయం చేయనున్నట్లు అకాడమీ తెలిపింది. తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి డా. నామోజు బాలాచారి సభాధ్యక్షతన రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో నవంబరు 1వ తేదీ శనివారం రాత్రి 6గంటల నుండి జరిగే ఈ పుస్తక పరిచయం కార్యక్రమానికి కాళోజీ అవార్డు గ్రహీత డా. అమ్మంగి వేణుగోపాల్ ముఖ్యఅతిథిగా, దూరదర్శన్ పూర్వ కార్యక్రమ నిర్వహణాధికారి డా. ఓలేటి పార్వతీశం గౌరవ అతిథిగా, తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు డా. ఏనుగు నరసింహారెడ్డి ఆత్మీయ అతిథిగా పాల్గొంటారని, అధికసంఖ్యలో సాహితీవేత్తలు, ఔత్సాహిక ప్రేక్షకులు విచ్చేసి కార్యక్రమాన్ని సుసంపన్నం చేయాలని కోరారు.

## గోల్ఫ్ క్రీడకు పెరుగుతున్న ఆదరణ

### - రిటైర్డ్ ఐఎఫ్ఎస్ నాగేంద్రప్రసాద్



సమ్మిట్‌ను ప్రారంభిస్తున్న రిటైర్డ్ ఐఎఫ్ఎస్ నాగేంద్రప్రసాద్ తదితరులు

**హైదరాబాద్, అక్టోబరు 30,ప్రభాతవార్త:** గోల్ఫ్ క్రీడకు ఆదరణ పెరుగుతోందనీ, ఇలాంటి ప్రతిష్టాత్మక ఈవెంట్ ద్వారా తెలంగాణ టూరిజం కూడా అభివృద్ధి చెందుతుందని రిటైర్డ్ ఐఎఫ్ఎస్ అధికారి నాగేంద్ర ప్రసాద్ అభిప్రాయపడ్డారు. ఈమేరకు గురువారం గోల్ఫ్ ఇండస్ట్రీ అసోసియేషన్ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గోల్ఫ్ అండ్ టర్ఫ్ సమ్మిట్ 2025 గచ్చిబౌలీ బౌల్డర్ హిల్స్ గోల్ఫ్ క్లబ్ లో ఉత్సాహంగా ప్రారంభమైంది. దీనికి రిటైర్డ్ ఐఎఫ్ఎస్ అధికారి డాక్టర్ నాగేంద్ర ప్రసాద్ ఈ ముఖ్యఅతిధిగా మాజరై సమ్మిట్‌ను ప్రారంభించారు. ఈసందర్భంగా గోల్ఫ్ టర్ఫ్ నిర్వహణకు సంబంధించి పలు కార్పొరేట్ కంపెనీల స్టాల్స్‌ను ఇక్కడ ఏర్పాటు చేయగా వాటిని పరిశీలించారు. సౌత్ ఇండియాలోనూ, హైదరాబాద్ లోనూ గోల్ఫ్ క్రీడను ప్రమోట్ చేయడం, మౌలిక సదుపాయాలను అత్యుత్తమంగా రూపొందించడం వంటి అంశాలపై చర్చ జరిగింది. పలు కార్పొరేట్ కంపెనీలకు చెందిన ప్రముఖులు, గోల్ఫ్ ప్లేయర్స్‌తో పాటు గోల్ఫ్ ఇండస్ట్రీ అసోసియేషన్, పీజీటీఐకి చెందిన ప్రముఖులు ఈ ప్యానెల్ డిస్కషన్ లో పాల్గొన్నారు. అంతర్జాతీయ స్థాయి గోల్ఫ్ కోర్సుల నిర్మాణంతో పాటు యువ గోల్ఫర్లకు అత్యుత్తమ ట్రైనింగ్, ఇతర అంశాలపై చర్చించారు.

## వీణావిద్వాంసురాలు మాధురికి సత్కారం



డాక్టర్ ఏఎస్.మాధురిని సత్కరిస్తున్న తెలంగాణ శాసనమండలి సభ్యుడు గోరేటి వెంకన్న

**చిక్కడపల్లి, అక్టోబర్ 30 ప్రభాతవార్త:** వీణావిద్వాన్, సుప్రసిద్ధ వీణా విద్వాంసురాలు వండర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు హోల్డర్(వీణ) డాక్టర్ ఏఎస్. మాధురి కి పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమం సాహిత్య రత్న చిక్కా రామదాసు మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగింది ముఖ్య అతిథిగా తెలంగాణ శాసనమండలి సభ్యుడు గోరేటి వెంకన్న హాజరై పురస్కారాన్ని ప్రధానం చేసి ప్రసంగించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ నిర్వాహకులు బింగి నరేందర్ గౌడ్ చిక్కా రవికిరణ్(అధ్యక్షులు) చిక్కా దేవదాసు చిక్కా శంకర్, చిక్కా శ్రీనివాస్ కార్యక్రమాన్ని సమన్వయము చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా డాక్టర్ ఏఎస్ మాధురి శిష్య బృందం నిర్వహించిన వీణా వాయిద్య కచేరి అందర్నీ సంగీత సాగరంలో తేలి ఆడించింది.

## శివకేశవులకు ప్రీతికరమైన కార్తీక మాసం



జ్యోతిష్య పండితురాలు భార్గవిని సత్కరించిన దృశ్యం

**చిక్కడపల్లి అక్టోబర్ 30(ప్రభాతవార్త):** కార్తీక మాసం శివకేశవులకు ప్రీతికరమైనది జ్యోతిష్య పండితురాలు భార్గవి అన్నారు. శుక్రవారం వివేక్ నగర్ శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో కార్తీకమాస ఉత్సవాన్ని పురస్కరించుకొని భార్గవి ఆధ్వర్యంలో కార్తీకమాస విశిష్టత ప్రత్యేకత గురించి ప్రవచన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ మాసంలో చేసే పుణ్యకార్యాలు, వ్రతాలు, దానాలు, దీపారాధనలు, నదీస్నానాలు వంటివి జన్మజన్మల పాపాలను పోగొట్టి మోక్షాన్ని ప్రసాదిస్తాయని పేర్కొన్నారు. ముఖ్యంగా, కార్తీక సోమవారాల్లో శివలింగానికి అభిషేకాలు, బిల్వార్చనలు చేయడం, ఉపవాసాలు ఉండటం వంటివి విశేష పుణ్యఫలాలను ఇస్తాయి. ఈ మాసంలో తులసి పూజకు కూడా ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు.ఈ సందర్భంగా ఆలయం ఈ ఓ మాచర్ల దేవనాథం, ముఖ్య అర్చకులు బుగ్గ లక్ష్మీ ప్రతి శర్మ, నారాయణశాస్త్రి ని ఘనంగా సత్కరించారు.

## హైబిజ్ ప్రయాణంలో నూతన శిఖరాలను అధిరోహించాలి : కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



ప్రీమియం ఈవెంట్ మేనేజ్ మెంట్ బ్రాండ్ అనుభవ సంస్థ కార్యాలయ ప్రారంబోత్సవంలో మంత్రి కిషన్‌రెడ్డి తదితరులు

**సంజీవరెడ్డి నగర్,అక్టోబర్ 30 ప్రభాతవార్త:** ప్రీమియం ఈవెంట్ మేనేజ్ మెంట్ బ్రాండ్ అనుభవ సంస్థ అయినా హైబిజ్ వన్ జూబ్లీ హిల్స్‌లోని రోడ్డు నెం 36,ఎస్ట్ ఎండ్ మాల్ 4వ అంస్థులో తన నూతన కార్పోరేట్ కార్యాలయాన్ని ప్రారంభించింది. కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి చేతుల మీదుగా ఈ ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ సుదీర్ఘ అనుభవంతో హైబీ జోన్ సంస్థ స్థాపించిన యాజమాన్యాన్ని అభినందించారు. హైబి జోన్ ప్రయాణంలో నూతన శిఖరాలను అధిరోహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకురాలు,మేనేజింగ్ డైరెక్టర్ సంధ్యారాణి, సంస్థ చైర్మన్ రవి ఒప్రిస్ మాట్లాడుతూ హైబిజ్ వన్ కార్పోరేట్, గవర్నమెంట్ లైఫ్ స్టైల్ విభాగాల్లో ఎండ్‌టు ఎండ్ ఈవెంట్ మేనేజ్‌మెంట్ పరిష్కారాలను అందించే ప్రముఖ సంస్థ అని తెలిపారు. సమావేశాలు,బ్రండ్ లాంచ్‌లు అవార్డు వేదుకల నుంచి పెద్ద ఎత్తున పబ్లిక్ ఈవెంట్‌ల వరకు అన్ని కార్యక్రమాలను హైబిజ్ వన్ అద్భుతంగా నిర్వమిస్తుందన్నారు. ఈ ప్రారంబోత్సవం సంస్థకు మొదటి మైలు రాయిగా పేర్కొన్నారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆశీర్వాదంతో హైబిజ్ వన్ మరింత ఉత్సాహంగా,బలంగా ముందుకు సాగుతామని మేనేజింగ్ డైరెక్టర్ సంధ్యారాణి పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని ఈనూతన కార్యాలయం మా క్లయింట్‌లకు మరింత మెరుగైన సేవలు అందిస్తుందని చైర్మన్ రవి ఒప్రిస్ అన్నారు. ఈ కార్యక్రమంలో హైబిజ్ టీవి వ్యవస్థాపకులు, ఎండి మాడిశెట్టి రాజగోపాల్,భారతీ సిమెంట్స్ మార్కెటింగ్ డైరెక్టర్ ఎం. రవీందర్‌రెడ్డి, ఏఆర్‌కె.గ్రూప్ సీఎండి రామ్‌రెడ్డి, బొలినేని గ్రూప్ వ్యవస్థాపకులు బొలినేని శీనయ్య,శ్రీ చక్రమిల్క్ఎండీ చేపూరి రావ్ మల్లికార్జున, ఎల్లారెడ్డిగూడ మాజీ ఎమ్మెల్యే సురేందర్‌తో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## ముష్కిన్ చెరువు స్థలం పరిరక్షణకు హైడ్రా కట్టుబడి ఉంది

**- హైడ్రా కమిషనర్ రంగనాథ్**
**- ఈ చెరువు 60.ఎకరాల చుట్టూ హద్దులు నిర్ణయిస్తాం**
**- వచ్చే వారంలోపు చెరువు స్థలం సర్వే పూర్తి చేస్తాం**



మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని ముష్కిన్ చెరువు స్థలం పరిరక్షణపై ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్న హైడ్రా కమిషనర్ రంగనాథ్.

**నార్సింగి, అక్టోబర్ 30 ప్రభాతవార్త :** మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని ముష్కిన్ చెరువు స్థలం పరిరక్షణకు హైడ్రా అంకిత భావంతో పని చేస్తుందని హైడ్రా కమీషనర్ రంగనాథ్ పేర్కొన్నారు. గురువారం హైడ్రా కార్యాలయంలో ముష్కిన్ చెరువు పరిసర కాలనీల ప్రతినిదులు, దేవాలయ కమిటీ సభ్యులు, రైతులు, ఇరిగేషన్ శాఖ అధికారులు, తత్వ ఆర్గనైజేషన్ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమీషనర్ రంగనాథ్ మాట్లాడుతూ వచ్చే ఒక వారం లోపు సర్వే పూర్తి చేసి, ముష్కిన్ చెరువుకు సంబంధించిన 60.ఎకరాల భూమి సరిహద్దులు గుర్తించడం జరుగుతుందన్నారు. ఈ తరువాత తత్వ సంస్థ వేగంగా చెరువు సుందరీకరణ పనులు చేపట్టాలని, చెరువు కట్ట బలోపేత పనులు ప్రారంభించాలని తెలిపారు. ఈ చెరువుకు సంబంధించిన భూములలో ఎలాంటి భూదందాలు చేయకుండా పకడ్బంధీ చర్యలు తీసుకుంటామని, ఎవరైనా చట్టాన్ని అతిక్రమిస్తే క్రిమినల్ కేసులు పెడ్తామని హెచ్చరించారు. చెరువు ఎఫ్‌టిఎల్ పరిధిలోని భూములను ప్రభుత్వం పరిహారం ఇచ్చి స్వాధీనం చేసుకొని, పునరుద్ధరించేందుకు సిద్ధంగా ఉందన్నారు. ఈ చర్యల వలన వర్షపు నీటి నిలువ మెరుగు పడటం, భూగర్భ జలాల పెరుగుదల, గాలి నాణ్యత మెరుగు పడటం వంటి ప్రయోజనాలు కలుగుతాయన్నారు. చెరువులు, కుంటలు, చారిత్రక ఫిరంగి నాలాలు, బుల్కాపూర్ నాలాలు, ప్రభుత్వ భూముల పరిరక్షణకు హైడ్రా అహర్నిషలు పని చేస్తుందని కమీషనర్ రంగనాథ్ స్పష్టం చేశారు. హైడ్రా కమీషనర్ స్పందన పట్ల ముష్కిన్ చెరువు పరిసర కాలనీల ప్రతినిధులంతా ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో హాల్‌మార్క్ వికినియా, మైహోమ్ అవతార్ కాలనీలకు చెందిన గౌతమ్, లింగరాజు, రవీంద్రచారి, రైతులు బట్ట సత్యనారాయణ, బట్ట రాజు, ఇరిగేషన్ శాఖ అధికారులు రమాదేవి, నరేంద్ర, తత్వ సంస్థ ప్రతినిధి రాఖేష్ తదితరులు పాల్గొన్నారు.

## వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించడమే లక్ష్యం

### -కాంతరెడ్డి నగర్‌లో విద్యుత్ ఫీడర్ ప్రారంభం



**అత్తాపూర్ అక్టోబరు30,ప్రభాతవార్త :** వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించడమే లక్ష్యంగా విద్యుత్ అధికారులు పనిచేస్తున్నారని బిజెపి చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ నారగూడెం మల్లారెడ్డి పేర్కొన్నారు.గురువారం అత్తాపూర్ డివిజన్ పరిధిలోని కాంత రెడ్డి నగర్ నూతన విద్యుత్ 11కెవి ఫీడర్‌ను విద్యుత్ శాఖ అధికారులతో కలిసి బిజెపి నేత మల్లారెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...విద్యుత్ అధికారులు ప్రత్యేక చొరవతో కాంత రెడ్డి నగర్‌లో నూతన విద్యుత్ ఫీడర్ ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందని అదేవిధంగా వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించాలని అధికారులను కోరారు. అనంతరం అధికారులు మాట్లాడుతూ...క్వాలిటీ విద్యుత్ సరఫరా విషయంలో టిజిఎస్‌పిడిసిఎల్ సిఎండి ముషారఫ్ అలీ ఆదేశాలు మేరకు ప్రజలకు విద్యుత్ సమస్యలు రాకుండా చూడాడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మెట్రో జోన్ చీఫ్ ఇంజనీరు వి.ప్రభాకర్,టిజిఎస్‌పిటిసిఎల్ సౌత్ సర్కిల్ ఎస్ఈ టి.శ్రీనివాస్,చార్మినార్ డిఈ ఎం.శ్రీధర్,మీరాలం ఏడిఈ వెంకటేష్ గౌడ్,చార్మినార్ సిబిడి ఏడిఈ మహ్మద్ అక్బర్, అత్తాపూర్ విద్యుత్ స్టేషన్ ఏఈ సత్యనారాయణ గౌడ్‌తో పాటు పలువురు విద్యుత్ ఉద్యోగులు,పాల్గొన్నారు.

## రక్తదాతలైన రక్షక భటులు



మెగా వైద్య శిబిరంలో రక్తదానం చేసిన పోలీసులు.

**బేగంపేట అక్టోబరు 30,ప్రభాతవార్త**

రక్షక భటులు రక్తదాతలయ్యారు.పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా నార్త్‌జోన్ పరిధిలోని మహంకాళీ డివిజన్ ఆధ్వర్యంలో రక్తదానం శిబిరం నిర్వహించారు.ఈ మెగా రక్తదాన శిబిరం మెహదీపట్నం పయనీర్ బ్లడ్ బ్యాంకు సహకారంతో మహంకాళీ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో ప్రజల సహకారంతో 166మంది రాంగోపాల్‌పేట పరిధిలోని జొరాస్టియన్ క్లబ్ లో రక్తదాన శిబిరం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పోలీసులతో పాటు యువత పాల్గొని రక్తదానం చేసారు.

## మౌలిక వసతులు కల్పించడమే మున్సిపాలిటీ లక్ష్యం

### కమిషనర్ వెంకటరెడ్డి

**కీసర, అక్టోబరు30,ప్రభాతవార్తః** దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి కాలనీలలో మౌలిక వసతులు కల్పించడమే మున్సిపాలిటీ లక్ష్యమని కమిషనర్ వెంకట్‌రెడ్డి అన్నారు.గురువారం మున్సిపాలిటీ పరిధిలోని చీర్యాల గ్రామంలో డబుల్ బెడ్‌రూం కాలనీలలో సమస్యలు విలయతాండవం ఆడుతున్నాయని మండల బిజెపి పార్టీ అధ్యక్షులు కోల బాలరాజు యాదవ్ కమీషనర్‌కి వినతి పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా బాలరాజు యాదవ్ మాట్లాడుతూ డబుల్ బెడ్ రూం ఇండ్ల కాలనీల ప్రజలు ఎన్నో కష్టాలు అనుభవిస్తున్నారని అన్నారు.కాలనీలో కేవలం ఇండ్లు మాత్రమే ఉన్నాయని కనీస మౌలిక వసతులు లేవని,ఇండ్ల పట్టాలు వచ్చాయి కానీ డ్రైనేజీ,త్రాగునీరు,రోడ్లు,కరెంటు సమస్య,ఇంటి నంబర్లు లేవని చీకట్లో ఎక్కడ ఏముందో తెలియక నానా అవస్థలు పడుతున్నారని తెలిపారు.ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ డబుల్ బెడ్ రూం ఇండ్లల్లో సమస్యలను తీర్చడానికి సిద్ధంగా ఉన్నామని,కనీస మౌలిక వసతులు కల్పనకు కృషి చేస్తామని అన్నారు.డబుల్ బెడ్ రూం ఇండ్ల కాలనీలో ఇంటి నంబర్లు 3 వారాల్లో ఇస్తామని తెలిపారు.సమస్యలను తీరుస్తానని కమీషనర్ హామీ ఇవ్వడంతో కాలనీ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు బోడ శ్రీనివాస్, రమేష్ గౌడ్,కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## పోలీసు అమరుల త్యాగాలు వెలకట్టలేనివి

### మహేశ్వరం డిసిపి సునీతా రెడ్డి

**ఇబ్రహీంపట్నం, అక్టోబరు 30 ,ప్రభాతవార్త :** పోలీసు అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివని మహేశ్వరం డిసిపి సునీతా రెడ్డి పేర్కొన్నారు.పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా డిజిపి శివధర్‌రెడ్డి, రాచకొండ సిపి సుధీర్ బాబు ఆదేశాల మేరకు ఇబ్రహీంపట్నం పట్టణ కేంద్రంలో ఏసిపి కెపివి రాజు ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు.ఈ రక్తదాన శిబిరాన్ని డిసిపి సునీతా రెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలీసు అమరవీరులను స్మరిస్తూ వారి త్యాగాలను గుర్తుచేస్తూ వారికి ఘన నివాళులు అర్పించారు.మొత్తం ఆరు పోలీసు స్టేషన్ల ఎస్‌హెచ్ వో లు,సిబ్బంది పాల్గొని రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేశారని తెలిపారు.ఇబ్రహీంపట్నం డివిజన్‌లోని ఆదిభట్ల,యాచారం, మంచాల, మాడుగుల,గ్రీన్ ఫార్మ సిటీ పోలీస్ స్టేషన్ సిబ్బంది హాజరయ్యారు.ఈ యొక్క కార్య క్రమంలో సిఐలు నందీశ్వర్ రెడ్డి,మహేందర్ రెడ్డి,మధు ,రవికుమార్ ,సత్యనారాయణ, వేణుగోపాల్, ఎస్సైలు,పోలీసు సిబ్బంది,యువజన సంఘాల సభ్యులు,క్రీడాకారులు,వివిధ ఇంజనీరింగ్ కాలేజ్ విద్యార్థిని,విద్యార్థులు,ప్రజలు రక్తదాన శిబిరంలో పాల్గొన్నారు

## లక్ష్యాన్ని సాధించిన ఉమాకు అభినందనలు తెలిపిన బిజెపి నాయకులు



**కేశంపేట ,అక్టోబర్ 30, ప్రభాతవార్త :** కేశంపేట పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న ఉమా గ్రూప్ 2కి ఎంపికైన సందర్భంగా ఆమెకు కేశంపేట మండలానికి చెందిన బిజెపి నాయకులు గురువారం కేశంపేట పోలీస్ స్టేషన్ లో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. సెక్రటేరియట్‌లో విధులు నిర్వహించబోతున్న ఉమాకు అభినందనలు తెలిపారు. రంగారెడ్డి జిల్లా భారతీయ జనతా పార్టీ యువ నాయకులు కర్రెడ్ల నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, ఒకవైపు గత కొంతకాలంగా కేశంపేట పోలీస్ శాఖలో విధులు నిర్వహిస్తూ మరోవైపు ఫ్యామిలీని చూసుకుంటూ. లక్ష్యాన్ని సాధించాలన్న పట్టుదలతో గ్రూప్ 2కి ఎంపికై సెక్రెటరియేట్‌లో బాధ్యతలు నిర్వహించబోతున్న కానిస్టేబుల్ ఉమా మరింత ఉన్నత శిఖరాలకు చేరాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ కౌన్సిల్ సభ్యులు కంచుకోట మహేష్, మండల ప్రధాన కార్యదర్శి కల్వకోలు తిరుపతి, పిప్పళ్ళ నరేందర్, మండల బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వర్షపు నీటి గుంతలను పూడ్చిన ట్రాఫిక్ పోలీసులు



రోడ్డుపై ఉన్న గుంతలను పూడుస్తున్న దృశ్యం

**కొంపల్లి, అక్టోబర్ 30, ప్రభాతవార్త**

గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు బాచుపల్లి ప్లైఓవర్ వద్ద పెద్ద ఎత్తున గుంతలు ఏర్పడి వర్షపు నీరు నిండిపోయి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది. దీంతో గురువారం మియాపూర్ ట్రాఫిక్ పోలీసులు వర్షానికి ఏర్పడిన గుంతలను పూర్తిగా మూసి వేయించి వర్షపు నీరును పూర్తిగా తొలగింపజేసి ఆ గుంతలలో రాయి పౌడర్, సన్న కంకర, సిమెంట్‌తో కూడిన మిశ్రమాలను వేసి గుంతలను పూడ్చి వేయడానికి ఉపయోగించారు. అనంతరం బుల్డోజర్‌ను తెప్పించి ప్లైఓవర్ వద్ద ఇరువైపులా రోడ్డు గట్టిపడేలాగా అటు ఇటు తిప్పించి వాహనాల రాకపోకలకు అంతరాయం లేకుండా రోడ్డు పనులు పూర్తి చేశారు. నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లిలో ప్లైఓవర్ పనులు మొదలుపెట్టిన నాటినుండి పలుమార్లు ప్లైఓవర్ ఇరువైపులా రోడ్లు వర్షాల ధాటికి చెదిరిపోతూ తరచూ వాహన చోదకులకు ఇబ్బందిగా పరిణమించింది. దీంతో వర్షం పడిన ప్రతిసారి మియాపూర్ ట్రాఫిక్ పోలీసులు ప్లైఓవర్ ఇరువైపులా రోడ్డును ఎప్పటికప్పుడు గుంతలను పూడుస్తూ అందులో సిమెంటు, కంకర, రాయి పౌడర్ మిశ్రమాలను కల్పించి ఆ గుంతలను పూడ్చివేయడం జరుగుతూ వస్తుంది. ప్లైఓవర్ పనులు త్వరగా పూర్తి అయితే ఇరువైపులా పటిష్టమైన రోడ్డుని ఒకేసారి ఏర్పాటు చేయడానికి అధికారులు ప్రయత్నిస్తున్నారు. మొదట ప్లైఓవర్ పనులు పూర్తి అయిన అనంతరం ప్లైఓవర్‌కు రెండువైపులా రోడ్డును అభివృద్ధి పరచనున్నట్లు సమాచారం.

## నవంబర్ 1 నుండి 30 వరకు డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ క్యాంపెయిన్



లైఫ్ సర్టిఫికెట్ క్యాంపెయిన్ వివరాల నమూనాను ఆవిష్కరిస్తున్న రైల్వే అధికారులు

**తార్నాక, అక్టోబర్ 30 ప్రభాతవార్త :** భారత రైల్వే మంత్రిత్వ శాఖ ఆదేశాలమేరకు దక్షిణ మధ్య రైల్వే జోన్ వ్యాప్తంగా డిజిటల్ లైఫ్ సర్టిఫికేట్ క్యాంపెయిన్ 4.0ను నవంబర్ 1 నుండి 30వరకు ప్రారంభించనున్నది. ప్రతి సంవత్సరం పెన్షనర్లు పెన్షన్ కొనసాగింపు కోసం నవంబర్ నెలలో లైఫ్ సర్టిఫికేట్ సమర్పించవలసి ఉంటుంది. పెన్షనర్లకు సాధికారత కల్పించడానికి, లైఫ్ సర్టిఫికెట్లను సమర్పించే ప్రక్రియను మరింత సజావుగా, సౌకర్యవంతంగా ఉండేలా చూసుకోవడానికి డిజిటల్ లైఫ్ సర్టిఫికేట్ ప్రచారం పెద్ద ఎత్తున చేపట్టనుంది. ఈ చొరవ అన్ని పెన్షనర్లకు, ముఖ్యంగా సీనియర్ పెన్షనర్లకు డిజిటల్‌గా లైఫ్ సర్టిఫికేట్ సమర్పించే సౌలభ్యాన్ని అందించడం ద్వారా ప్రయోజనం చేకూరుస్తుంది.పెన్షన్ అండ్ పెన్షనర్ల సంక్షేమ శాఖ (డిపార్ట్మెంట్ ఆఫ్ పెన్షన్ అండ్ పెన్షనర్లు వెల్ఫేర్) యూ.ఐ.డి.ఏ.ఐ, ఎం.ఇ.ఐ.టి.వై సహకారంతో కేంద్ర ప్రభుత్వ పెన్షనర్ల "ఈజ్ ఆఫ్ లివింగ్"ని పెంపొందించడానికి ముఖ ప్రమాణీకరణ(ఫేస్ అథెంటికేషన్)ను ప్రారంభించింది. గత మూడు సంవత్సరాలలో రాష్ట్ర మరియు కేంద్ర ప్రభుత్వాలకు చెందిన పెన్షనర్లు 4.50 కోట్లకు పైగా డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్లను సమర్పించారు.డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ల వల్ల పెన్షనర్లు తమ జీవిత ధృవీకరణ పత్రాన్ని సమర్పించడానికి పెన్షన్ పంపిణీ కార్యాలయాలను సందర్శించాల్సిన అవసరాన్ని తొలగిస్తుంది. పెన్షనర్లు తమ నివాసాల నుండి డిజిటల్‌గా జీవిత ధృవీకరణ పత్రాన్ని సమర్పించవచ్చని వెల్లడించారు.లైఫ్ సర్టిఫికేట్ పొందే ప్రక్రియను సులభతరం చేస్తుంది. పెన్షనర్ల సమయం మరియు కృషిని ఆదా చేస్తుందని అధికారులు వెల్లడించారు.

## బాలబాలికలకు వివిధ అంశాలపై ప్రతిభాపాటవ పోటీలు

**చిక్కడపల్లి, అక్టోబరు 30 ప్రభాతవార్త:** బాలానందంట్రస్ట్ ఆధ్వర్యంలో 86 వార్షికోత్సవం సందర్భంగా నవంబరు 9వ తేదీ నుంచి జంటనగరాల బాలబాలికలకు వివిధ అంశాలపై ప్రతిభాపాటవ పోటలు నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ వివరించింది. నారాయణగూడలోని ట్రస్ట్ ఆవరణలో జరిగే ఈ కార్యక్రమాలకు సంబంధించి ఇతర వివరాలకు 8121023248 ద్వారా ఇతర వివరాలు పొందవచ్చన్నారు. నర్సరీ నుంచి 9వ తరగతి చదువుతున్న బాలబాలికలు ఈ పోటీలలో పాల్గొనడానికి అర్హులు అని అన్నారు. నర్సరీ రైమ్స్(తెలుగు), నీతిపద్యాలు, భక్తిగీతాలు, లలిత గీతాలు, సినిమా పాటలు, కర్ణాటక సంగీతం, రామదాసు కీర్తనలు, అన్నమాచార్య కీర్తనలు, చిత్రలేఖనం, కూచిపూడి, భరతనాట్యం, భక్తిగీతాలు తదితర అంశాలలో పోటీలుంటాయన్నారు. ఈ పోటీలలో గెలుపొందిన వారికి త్వరలో జరగబోయే వార్షికోత్సవం సందర్భంగా బహుమతులు అందజేస్తారు.

## కెటిఆర్ రోడ్‌షోకు భారీ ఎత్తున తరలిరావాలి

### - రాజేంద్రనగర్ నియోజకవర్గ బిఆర్ఎస్ ఇంచార్జి కార్తిక్‌రెడ్డి

**నార్సింగి, అక్టోబర్ 30 ప్రభాతవార్త :** బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ శుక్రవారం జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో చేపడుతున్న రోడ్‌షోకు రాజేంద్రనగర్ నియోజకవర్గం నుంచి బిఆర్ఎస్ శ్రేణులు భారీ ఎత్తున తరలి రావాలని ఇంచార్జి కార్తిక్‌రెడ్డి ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గండిపేట, రాజేంద్రనగర్, శంషాబాద్ మండలాల నుంచి గులాబీ దండు పెద్ద ఎత్తున జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల సందర్భంగా కేటీఆర్ తలపెట్టిన రోడ్‌షోలో పాల్గొని మన సత్తాను చాటాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు బిఆర్ఎస్ అధ్యక్షులు సీతారాం ధూళిపాళ, విష్ణువర్ధన్‌రెడ్డి, నాగరాజులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. సాయంత్రం 5. గంటలకు రోడ్‌షో ఉంటుందని, 4.గంటల వరకు రాజేంద్రనగర్ నియోజకవర్గంకు చెందని పార్టీ నాయకులు, శ్రేణులు జూబ్లీహిల్స్‌కు చేరుకోవాలని కార్తిక్‌రెడ్డి పేర్కొన్నారు.

## ఎలివేటెడ్ కారిడార్ రోడ్ల పరిశీలన



అధికారులతో పాటు రోడ్లను పరిశీలిస్తున్న కంటోన్మెంట్ బోర్డ్ నామినేటెడ్ మెంబర్ బానుక నర్మద మల్లికార్జున

**కంటోన్మెంట్, అక్టోబర్ 30 ప్రభాతవార్తః** సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డ్ పరిధిలో నిర్మిస్తున్న ఎలివేటెడ్ కారిడార్ దృష్ట్యా కంటోన్మెంట్ బోర్డ్ సీఈఓ అరవింద్ ద్వివేదితో కంటోన్మెంట్ బోర్డ్ నామినేటెడ్ మెంబర్ బానుక నర్మద మల్లికార్జున్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో నిర్మిస్తున ఎలివేటెడ్ కారిడార్ ను దృష్టిలో ఉంచుకొని రహదారులు మళ్లింపు, రోడ్ల మరమ్మతులు పూర్తి స్థాయి లో చేపట్టి వాహనదారులకు ఇబ్బంది లేకుండా చూడాలని సీఈఓను , ఇంజనీర్లు ను బానుక నర్మద కోరారు. ఈ సమావేశం లో కంటోన్మెంట్ బోర్డ్ చీఫ్ ఇంజనీర్లు ఫణి కుమార్,ఉమాశంకర్ గార్లు పాల్గొన్నారుం. అనంతరం బానుక నర్మద ఇద్దరు చీఫ్ ఇంజనీర్లు తో కలసి స్థానిక డైమండ్ పాయింట్, టార్బండ్, సిఖ్ విలేజ్,బాపూజీ నగర్,టివోలీ, బోయినపల్లి మార్కెట్,ప్యారడైజ్ మొదలైన ప్రాంతాల్లో పర్యటిస్తూ రోడ్ల పరిస్థితిని, ట్రాఫిక్ సమస్యలను పరిశీలించారు.

## ఆత్మహత్య చేసుకున్న బి.టెక్ విద్యార్థి



పి.మల్లికార్జున ఫైల్ ఫోటో

**పేట్ బషీరాబాద్, అక్టోబర్ 30, ప్రభాతవార్త**

మైసమ్మగూడలోని సిరి డీలక్స్ బాయ్స్ హాస్టల్‌లో ఒక విద్యార్థి బుధవారం రాత్రి సుమారు 11.45 గంటల సమయంలో ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం క్రిష్ణారావు కాలనీ, దామరచర్ల, నల్గొండ జిల్లాకు చెందిన పి. మల్లికార్జున (19) మల్లారెడ్డి ఎంఆర్ఐటి కాలేజీలో బి.టెక్ 3వ సంవత్సరం చదువుతున్నాడు. 29.10. 2025 సాయంత్రం పరీక్షలు ముగిసిన తరువాత రూమ్ మేట్స్ జయంత్, సురేష్ ఇతర స్నేహితులు రాత్రి 10.30 గంటల వరకు అతనితో మాట్లాడారు. అనంతరం రూమ్‌లో ఒంటరిగా ఉన్న మల్లికార్జునను రాత్రి సుమారు 11.45 గంటలకు స్నేహితులు పిలిచినప్పుడు స్పందన లేకపోవడంతో తలుపు పగులగొట్టి లోపలికి వెళ్లి చూశారు. అతను ఫ్యాన్‌కు టవల్‌తో ఉరివేసుకుని కనిపించగా వెంటనే అతన్ని ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అతను అప్పటికే చనిపోయినట్టు తెలిపారు. ఈ ఘటనపై పేట్ బషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు.

## డివైడర్‌ను ఢీకొని యువకుడి మృతి

**కెపిహెచ్‌బి కాలనీ, అక్టోబర్ 30, ప్రభాతవార్త**

ద్విచక్ర వాహనం అదుపుతప్పి ప్రమా దవశాత్తు డివైడర్‌ను ఢీకొన్న సంఘటన లో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన బాలనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బోయిన్‌పల్లి ప్రాంతానికి చెందిన సతీష్ కుమార్ కొడుకు రోహన్ దేవ్ ( 21) హైటెక్ సిటీలోనీ మాదాపూర్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. ప్రతిరోజు మాదిరిగానే గురువారం ఉద యం బోయిన్‌పల్లిలోని ఇంటి నుండి బయలుదేరి విధులకు వెళుతుండగా మార్గమధ్యంలో బాలనగర్ ఫ్లైఓవర్ పై ద్విచక్ర వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది.ఈ సంఘటనలో రోహన్ దేవ్ తలకు బలమైన గాయాలు తగల దంతో ఆసుపత్రికి తరలించగా అ ప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలియజేశారు. ఈ మేరకు బాలనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## పాన్ షాపు యజమాని హత్య కేసులో నిందితుల కోసం గాలింపు

**చార్మినార్,అక్టోబరు 30 ప్రభాతవార్త :** హైదరాబాద్ పాత బస్తీలో జరిగిన పాన్ షాపు యజమాని హత్యకేసులో నింధితుల కోసం గాలిస్తున్నామని బండ్లగూడ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఆర్.దేవేందర్ తెలిపారు.పాతబస్తీ బండడ్లగూడ గౌస్‌నగర్‌కు చెందిన పాన్‌షాపు నిర్వహించే షేక్ మొహసిన్ (23)కు దాదాపు రెండు నెలలు క్రితం వివాహం జరిగింది. గౌస్‌నగర్ పరిసర ప్రాంతాలకు చెందిన ఫాహిద్, ఆమెర్,సోహెల్ మొహసిన్ స్నేహితులు.షేక్ మొహసిన్ నడుపుతున్న పాన్‌షాపు వద్దకు ముగ్గురు స్నేహితులు బుధవారం రాత్రి వచ్చారు.మొహసిన్ అతని స్నేహితుల మధ్య గొడవ జరిగింది.కోపంలో వారు మొహసిన్‌ను పాన్‌షాపు నుంచి బయటకు లాగి కత్తులతో దాడి జరిపి అక్కడ నుంచి పారిపోయారు.పాన్‌షాపు యజమాని షేక్ మొహసిన్ సంఘటన స్థలంలోనే మృతి చెందాడు.నింధితుల కోసం గాలిస్తున్నామని ఇన్‌స్పెక్టర్ దేవేందర్ తెలిపారు.ఈ కేసును బండ్లగూడ పోలీసులు అన్ని కోణాలు నుంచి దర్యాప్తు చేస్తున్నారు.

## ఏర్పాట్లను పరిశీలించిన కంచిపీఠాధిపతి శ్రీశంకర విజయేంద్ర సరస్వతి



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కంచిపీఠాధిపతి శ్రీశంకర విజయేంద్ర సరస్వతి

**సికింద్రాబాద్, అక్టోబర్ 30 ప్రభాతవార్తః** శ్రీగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో నేడు నిర్వహించనున్న జీర్ణోద్ధరణ పూర్వక మహాసంప్రోక్షణ మహా కుంభాభిషేక ఏర్పాట్లను కంచి కామకోటి పీఠాధిపతి శ్రీశంకర విజయేంద్ర సరస్వతి పరిశీలించారు. గురువారం సాయంత్రం ఆలయాన్ని సందర్శించిన ఆయన పలు సలహాలు, సూచనలు అందించి నిర్వహణ ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పెద్దసంఖ్యలో హాజరైన భక్తులకు అనుగ్రహభాషణం చేశారు



కలెక్టరేట్‌లో వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

## మొంథా తుఫాన్ బాధితులను ఆదుకోవాలి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

జిల్లా వ్యాప్తంగా మొంథా తుఫాన్ ప్రభావంతో తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేసి మద్దతు ధరను చెల్లించాలని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సాయిరాం, మాజీ ఎంపిపి జాప శ్రీకాంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కలెక్టరేట్‌లో గురువారం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేసి మాట్లాడారు. తుఫాన్‌తో నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25 వేల నష్టపరిహారం అందివ్వాలన్నారు. జిల్లాలోని అన్ని కొనుగోలు కేంద్రాలలో తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలన్నారు. రైతులకు న్యాయం చేయకుంటే బిఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతులతో కలిసి ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సకాలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి వెంటనే ధాన్యం కొనుగోలు చేసి రైతులకు మద్దతు ధర అందించిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో మాజీ ఆత్మకమిటీ చైర్మన్ లక్కరసు ప్రభాకర్‌వర్మ, పిఎసిఎస్ చైర్మన్ శ్రీనివాస్, మాజీ వైస్ ఎంపిపి అల్లం ఎల్లం, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బ్యాక్ వాటర్ ముంపు బాధితులను ఆదుకోవాలి

**బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కాముని శ్రీనివాస్**



తడిసిన ధాన్యన్ని పరిశీలిస్తున్న నాయకులు

**చిన్నకోడూరు, అక్టోబరు 30, ప్రభాతవార్త :** అన్నపూర్ణ సాగర్ నుంచి కిందికి నీటిని వదిలి బ్యాక్‌వాటర్ ముంపు బాధితులను ఆదుకోవాలని బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు కాముని శ్రీనివాస్ కోరారు. గురువారం చెలుకపల్లిలో కొనుగోలు కేంద్రంలో నీటి మునిగిన ధాన్యాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మొంథా తుఫాన్ తో కురిసిన వర్షానికి కొనుగోలు కేంద్రంలోకి వర్షం నీరు వచ్చి ధాన్యం తడిసిపోయిందన్నారు. దీంతో రైతులకు తీరని నష్టం వాటిల్లిందనిచెప్పారు. ప్రభుత్వ ముందు చూపులేకపోవడంతోనేకొనుగోలు కేంద్రాలలో తుఫాన్‌తో ధాన్యం తడిసిపోయిందన్నారు. తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి మద్దతు ధర చెల్లించాలన్నారు. సిద్దిపేట టూ ఇల్లంతకుంట రహదారి పను లతో పాటు మల్లారం వయా దర్గపల్లి రహదారి పనులు వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు ములకల కనకరాజు, కాముని ఉమేష్‌చంద్ర, జంగిటి శ్రీనివాస్, కాల్వ ఎల్లం, లకపాక బాబు, చింతపల్లి కార్తీక్‌రెడ్డి, బండి దేవయ్య ఉన్నారు.

## డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తం వల్లే రోడ్డుపైకి నీరు

**బిజెపి పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్‌బాబు**



హుస్నాబాద్ బస్టాండ్‌లో నీటిలో నిలబడి నిరసన తెలుపు నాయకులు

**హుస్నాబాద్ రూరల్, అక్టోబరు 30, ప్రభాతవార్త :** మొంథా తుపాన్ వల్ల పట్టణంలో కురిసిన భారీ వర్షానికి పట్టణంలోని ప్రధాన రహదారి, దుకాణాలు,పంట పోలాలు నీటి మునిగి రైతులు, వ్యాపారస్తులు నష్ట పోయారని బీజేపీ పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్‌బాబు ఆరోపించారు. గురువారం అరెపల్లెలోని రైతుల పంట పోలాలను పరిశీలించిన అనంతరం అరెపల్లె కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతులను పరామర్శించారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని త్వరగా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.అదేవిధంగా పట్టణంలోని ప్రధాన రహదారిపై ఉన్న దుకాణాలు, బస్టాండ్,పలువురిని తుఫాన్ వల్ల ఇబ్బందులకు గురైన వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.మొంథా తుపాన్ వల్ల హుస్నాబాద్ పట్టణంలోని అరెపల్లెలో చాలా మంది రైతుల పంటలు నేలవాలి,పోలాల్లో మట్టి పెరుకుపోయి,నీళ్లు నిండి,వరి పంట పూర్తిగా మునిగిందని దీంతో వడ్లు మొలకెత్తి రైతులు నష్టపోతున్నారని వెంటనే నష్టపోయిన రైతులను గుర్తించి ప్రభుత్వం ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు.

## ప్రభుత్వం అండగా ఉంటుంది..ఆందోళన వద్దు...

**డిసిసి ఒబిసి సెల్ చైర్మన్, జిల్లా ఆర్టీఏ సభ్యుడు డా॥ సూర్యచంద్రవర్మ**

**సిద్దిపేట అర్బన్, అక్టోబరు 30, ప్రభాతవార్త:** మొంథా తుఫాన్ కారణం గా రెండు రోజుల పాటు కురిసిన భారీ వర్షాలకు జిల్లాలో పంటలకు తీరని నష్టం జరిగిందని.. రైతులు ఆధైర్యపడొద్దని... ప్రభుత్వం అండగా ఉం టుందని డిసిసి ఒబిసి సెల్ చైర్మన్, జిల్లా ఆర్టీఏ సభ్యులు డాక్టర్ లక్కరసు సూర్యచంద్రవర్మ అన్నారు. సిద్దిపేట నియోజకవర్గంలోని నారాయణరావు పేట, ఒగులాపూర్‌లో ఆయన పర్యటించి తుఫాన్ కారణంగా కురిసిన భారీ వర్షాలతో నష్టపోయిన పంటలను ధాన్యం కొనుగోలు కేంద్రాలలో తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. సిద్దిపేట నియోజకవర్గంలో పంటలకు తీరని నష్టం జరిగిందని మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ దృష్టికి తీసుకెళ్లాగా ఆయన వెంటనే స్పందించి అధికారులతో మాట్లాడి పంటల నష్టాన్ని అంచనావేసి రైతులకు సహకారం అందేలా చూడాలని ఆదేశించారని తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసి మద్దతు ధర చెల్లిస్తుందని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఆయన వెంట కిసాన్ సెల్ రాష్ట్ర కన్వీనర్ నాయిని నర్సింహ్మారెడినడ, డిసిసి ఉపాధ్యక్షులు మంద పాండు, మాజీ సర్పంచన సదాశివరెడ్డి, నాయకులు దేయ్య, రైతులు ఉన్నారు.



తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న సూర్యచంద్రవర్మ

# కేంద్ర ప్రభుత్వ లేబర్ పాలసీని వ్యతిరేకించండి

**సిఐటియు రాష్ట్ర అధ్యక్షుడు చుక్కా రాములు**



మాట్లాడుతున్న చుక్కా రాములు

**గజ్వేల్ టౌన్, అక్టోబరు 30 (ప్రభాతవార్త):** డిసెంబరు 7,8,9 తేదీలలో జరిగే రాష్ట్ర మహా సభలను జయప్రదం చేయాలని, కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చే నూతన లేబర్‌పాలసీని వ్యతిరేకించాలని సిఐటియు రాష్ట్ర అధ్యక్షుడు చుక్కా రాములు పిలుపు నిచ్చారు. గురువారం గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సి పల్ పరిధిలోని ఎస్ఎల్ఎన్ కన్వెన్షన్ హాల్‌లో జరిగిన రాణే మద్రాస్ లిమిటెడ్ వర్కర్స్ యూని యన్ ఆఫీస్ బేరర్స్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక చట్టాలను తుంగలో తొక్కి యజ మానులకు అనుకూలంగా నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చి వాటిని దొడ్డి దారిలో అమలు చేసేం దుకు శ్రమశక్తి నీతి 2025 పేరుతో నూతన లేబర్ పాలసీని తీసుకొచ్చిందని, దీనిని సిఐటియు తీవ్రం గా వ్యతిరేకిస్తుందన్నారు. కార్మికుల హక్కులకు రక్షణగా ఉండే చట్టాలను బలహీనం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తుందని చెప్పారు. వేత నాల వ్యవస్థను నిర్వీర్యం చేసి పర్మినెంట్ ఉద్యో గాలు లేని వ్యవస్థను తీసుకొచ్చేందుకు ప్రయత్నం చేస్తుందని తెలిపారు. పరిశ్రమలో అవకతవకలపై కార్మికుల భద్రతపై అధికారుల తనిఖీలు లేకుండా యజమానుల ఇష్టారాజ్యంగా నడుపుకునేటట్లు చట్టాలు రూపొందిస్తుందని పేర్కొన్నారు. దేశాన్ని కార్పొరేట్లు అభివృద్ధి చేస్తుందని అంటున్న వారిని మేము అడుగుతున్నామని కార్మికులు లేని కార్పొ రేట్ల అభివృద్ధి సాధ్యమేనా? కార్మికులు లేకుంటే కార్పొరేట్లు ఎలా అభివృద్ధి చేస్తారని ప్రశ్నించారు. రోజురోజుకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు కార్మికులకు ఇవ్వడంలేదని, వాటి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయడం లేదని అన్నారు. కార్మికులకు కనీస వేతనం నెలకు రూ.26వేలు ఇవ్వాలని, కార్మికవర్గ హక్కుల కోసం సిఐటియు ఇప్పటికే అనేక పోరాటాలు చేస్తుంద న్నారు. డిసెంబరులో మెదక్‌లో జరిగే రాష్ట్ర మహా సభలలో కనీస వేతనాల పెంపుదల కోసం, కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లకు వ్యతిరేకం గా, కార్మికవర్గ హక్కుల రక్షణ కోసం పోరాటాలు చేయడానికి ఉద్యమ కార్యాచరణ చేసి భవిష్యత్తులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాటాలు చేసి సాధించుకుంటామని, ఈ ఉద్యమాలలో కార్మికులు కలిసిరావాలని అన్నారు. సమావేశంలో యూని యన్ ప్రధాన కార్యదర్శి నాసగోని వేణుగోపాల్, ఉప ప్రధానకార్యదర్శి బండ్ల స్వామి, యూనియన్ నాయకులు పి.చంద్రశేఖర్‌రెడ్డి, ఎ.శ్రీనివాస్, ఎస్. రంగారెడ్డి, ఎస్కె.సాజిద్, కె.రాజగోపాల్, ఎస్.రవి కుమార్, అటకూరి స్వామి, అల్వాల శేఖర్‌రెడ్డి, జి.మల్లయ్య, ఎ.విమల తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న ఆర్ఎస్ రత్నాకర్

## వర్గీకరణ పేరుతో దళితుల ఐక్యతపై కుట్ర

**మాల మహానాడు జాతీయ అధ్యక్షులు ఆర్ఎస్ రత్నాకర్**

**సంగారెడ్డి మున్సి పాలిటీ అక్టోబరు 30, ప్రభాతవార్త:** వర్గీకరణ పేరుతో దళితుల ఐక్యతపై దేశవ్యాప్త చరిత్రలోనే అతి పెద్ద రాజకీయ కుట్ర అని మాల మహానాడు నేషనల్ ప్రెసిడెంట్ డా ఆర్.ఎస్.రత్నాకర్ అన్నారు. గురువారం సంగారెడ్డిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాలలంటేనే కాంగ్రెస్,అంటేనే మాలలు అనుకునే మమ్మల్ని, ఎస్సీ వర్గీకరణ పేరుతో గొంతు కోసింది రేవంత్ రెడ్డి సర్కార్ అని దీనికి తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. కనీసం ఏ విధమైనటువంటి శాస్త్రీయ డేటా లేకుండా 2011 గాలి లెక్కలు పట్టుకుని, అంత అత్యవసరం గా ఎస్సీ వర్గీకరణ చేయవలసిన అవసరం ఏం వచ్చిందని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో, అందోల్ మల్లేష్ , బీరం సతీష్ కుమార్, బైండ్ల అశోక్ కుమార్, అనంతయ్య కామ ప్రభాకర్ రావు, బల్లెం లక్ష్మణ్ ,. మిరియాల బాల శౌరి, మిరియాల చిన్నప్ప, దండు కుమార్‌అశోక్ వచ్చిందా తోట దుర్గాప్రసాద్, అశోక్ ల, కనికెళ్ళ నాని, నెల్లి సూరిబాబు,ఎం. అనంతరం, వి నర్సయ్య, బి ఉదయ్, బి పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

30జిజీఎల్6: నాచగిరిలో కార్తీకమాస పూజల్లో పాల్గొన్న భక్తులు

## నూతన వధువుకు ఆర్థిక సహాయం అందజేత

**సిద్దిపేట అర్బన్, అక్టోబరు 30, ప్రభాతవార్త :**

సిద్దిపేట మున్సిపల్ పరిధిలోని ఇందిరమ్మ కాలనీ లింగారెడ్డిపల్లికి చెందిన నూతన వధువు రమ్య వివాహ నిమిత్తం కౌన్సిలర్ ధర్మవరం బ్రహ్మం, మాజీ కౌన్సిలర్ ధర్మవరం స్వప్న గురువారం రూ.5వేల ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదలకు సేవ చేయడంలోనే నిజమైన తృప్తి లభిస్తుందన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన త్రిపుర గవర్నర్

**గజ్వేల్, అక్టోబరు 30 (ప్రభాతవార్త):** గజ్వేల్ పట్టణానికి చెందిన ప్రముఖ కవి, రచయిత రాయవరం విశ్వేశ్వరరావు, మంజుల దంపతుల కూతురు శివాని వివాహం ప్రజ్ఞాపూర్‌లోని ఎస్ఎల్ఎన్ కన్వెన్షన్ హాల్‌లో గురువారం జరగగా త్రిపుర రాష్ట్ర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం వివాహ వేడుకలో భోజనం చేసి హైద్రాబాద్‌కు తరలివెళ్లారు. కాగా గవర్నర్ ఇంద్రసేనారెడ్డి ప్రజ్ఞాపూర్ కు వచ్చిన సందర్భంగా గజ్వేల్ ఏసిపి నరసింహులు, స్థానిక సిఐ రవి కుమార్‌లు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

**జగదేవ్‌పూర్, అక్టోబరు 30 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని పీర్లపల్లి గ్రామానికి చెందిన కొడకండ్ల యాదగిరి అనారోగ్యంతో బాధపడుతూ మృతిచెందగా విషయం తెలుసుకున్న గజ్వేల్ నియోజకవర్గ రజక సంఘం అధ్యక్షుడు రాచమల్ల ఎల్లేష్ గురువారం జగదేవ్‌పూర్ మండల రజక సంఘం నాయకులతో కలిసి మృతుని కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రజక సంఘం పేద కుటుంబాలకు అండగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం నాయకులు వడ్లకొండ శ్రీనివాస్, రాచమల్ల నర్సింలు, కొడకండ్ల బాల్‌నర్సయ్య, శివకృష్ణ, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## యువత మత్తు పదార్థాలకు బానిస కావద్దు : ఎఎస్ఐ



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఏఎస్ఐ రమణారెడ్డి

జగదేవ్‌పూర్, అక్టోబరు 30 (ప్రభాతవార్త): యువత మత్తు పదార్థాలకు బానిసలై బంగారు భవిష్యత్తును పాడుచేసుకోవద్దని జగదేవ్‌పూర్ ఏఎస్ఐ రమణారెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని మునిగడప, చాట్లపల్లి గ్రామాల్లో ప్రజలకు వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడుపవద్దని, మద్యం మత్తులో నిండు ప్రాణాలు కోల్పోయి కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి ఉంటుందని, వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని అన్నారు. 18 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరు డ్రైవింగ్ లైసెన్స్ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చాట్లపల్లి విలేజ్ పోలీస్ ఆఫీసర్ రవి, మాజీ సర్పంచ్ అన్నబోయిన లక్ష్మణ్, యువకులు నవాబ్, తిరుపతి, మహిళలు పాల్గొన్నారు.

## పేరుకు పోయిన చెత్త తొలగింపు

(వార్తా ప్రభావం)

**బేగంపేట అక్టోబరు 30,ప్రభాతవార్త**

బేగంపేట డివిజన్ పరిధిలోని ప్రకాశంనగర్ పాత రిజిస్ట్రేషన్ ఆఫీసుకు వెళ్లే మార్గంలో ప్రధాన రోడ్డు వెంట చెత్త పేరుకు పోవడంపై ఈ నెల 29 హైదరాబాద్ వార్త మినీలో ,బేగంపేట లో పడకేసిన పారిశు ధ్యం,అనే కథనం ప్రచురితమైంది.ఈ కథనం పై స్పందించిన జీహెచ్ఎంసీ పారిశుధ్య అధికారులు పేరుకు పోయిన చెత్త ను తొలగిం చారు.దీంతో సమీప నివాస గృహాల వారు సంతోషం వ్యక్తం చేసారు. ఎంతో కాలంగా పేరుకు పోయిన చెత్త కుప్పలను తొలగించడంతో వారు అధికారులకు కృతజ్ఞతలు తెలియజేసారు.

## అనాథ బాలుడు ఆనంద నిలయానికి

**-మానవత్వం చాటుకున్న మాజీ ఎంపిటిసి కిరణ్‌గౌడ్**

**జగదేవ్‌పూర్, అక్టోబరు 30 (ప్రభాతవార్త):** తల్లి అనారోగ్యంతో మృతి చెందగా తండ్రి మతిస్థిమితం సరిగా లేకపోవడంతో కుమారుడు బిక్షాటన చేస్తుండడంతో గమనించిన మాజీ ఎంపిటిసి ఆ బాలున్ని ఆనంద నిలయానికి చేర్పించిన సంఘటన ఇది... జగదేవ్‌పూర్‌కు ఆరుసంవత్సరాల క్రితం పొట్టకూటి కోసం వచ్చిన భాగ్య, వెంకటేశంలకు ఒక కుమారుడు శివ(8) ఉండగా భాగ్య ఐదు నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. వెంకటేశం మతిస్థిమితం సరిగా లేకపోవడంతో కుమారుడు శివ గ్రామంలో బిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్నారు.బాలుడు బిక్షాటన చేస్తున్న విషయాన్ని గమనించిన మునిగడప మాజీ ఎంపిటిసి కిరణ్‌గౌడ్ ఆ బాలున్ని చదువుకునే వయసులో ఎందుకు బిక్షాటన చేస్తున్నావు అని ప్రశ్నించగా తల్లి చనిపోయిందని, తండ్రి ఆరోగ్యం బాగోలేదని తెలిపాడు. దీంతో కిరణ్‌గౌడ్ బాలుని తండ్రి వద్దకు వెళ్ళి పూర్తి వివరాలను తెలుసుకొని బాలునికి మంచి చదువు అందించడానికి ఆనంద నిలయంలో చేరుస్తానని చెప్పడంతో బాలుని తండ్రి ఒప్పుకున్నాడు. దీంతో గురువారం బాలుడు శివను కొండపాక మండలంలోని ఆనంద నిలయంలో చేర్చారు. ఈ సందర్భంగా కిరణ్‌గౌడ్ మాట్లాడుతూ బాలుని చదువు కోసం కృషి చేస్తానని, ఎప్పుడు ఎలాంటి అవసరం వచ్చినా అండగా ఉంటాన న్నారు. కార్యక్రమంలో బిజివెంకటాపూర్ మాజీ సర్పంచ్ నీల మంజుల రమేష్ ఉన్నారు.

## నేడు హత్నూర మండలంలో ఐక్యత పరుగు

**హత్నూర అక్టోబరు 30, ప్రభాతవార్త :** సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా రాష్ట్రీయ ఏక్తా దివస్ కార్యక్రమంలో భాగంగా శుక్ర వారం హత్నూర మండలం దౌల్తాబాద్ తెలంగాణ తల్లీ చౌరస్తా నుండి దేవుల పల్లి గేట్ శివాజీ విగ్రహం వరకు ఉదయం 7 గంటలకు హత్నూర పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రన్ ఫర్ యూనిటీ కార్యక్రమం నిర్వహించబడం జరుగు తుందని ఎస్ఐ శ్రీధర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. యువకులు, విద్యా ర్థులు, గ్రామస్తులు హాజరై కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు.

**రత్నపూరి కళాశాల ఆధ్వర్యంలో...**

సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం మండలం పరిధిలోని రత్నపురి సంస్థలు కళాశాల ప్రాంగణం నుండి మల్కా పూర్ చౌరస్తా వరకు 500 మంది విద్యార్థులతో ఉదయం తొమ్మిదిన్నరకు ఐక్యతా పరుగును నిర్వహించడము జరుగుతుందని అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రఘు ఒక ప్రకటనలో తెలిపారు.

## దళితుల ఆత్మగౌరవ ప్రదర్శన విజయవంతం చేయాలి

**సికింద్రాబాద్, అక్టోబర్ 30 ప్రభాతవార్త:**

ఈ నెల 6న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయ్ పై దాడిచేసిన దుండగుడిపై సుమోటోగా కేసు నమోదుచేసి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో నవంబర్ 1న హైదరాబాదులో జరిగే దళితుల ఆత్మగౌరవ ప్రదర్శన ర్యాలీకి సికింద్రాబాద్ నియోజకవర్గం నుండి కుల మతాలకతీతంగా వేలాదిగా తరలి రావాలని కోరుతూ పార్సిగుట్ట డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం దగ్గర ప్లకార్డులతో ఎమ్మార్పీ ఎస్ నేతలు ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్పీ హైదరా బాద్ జిల్లా అధికార ప్రతినిధి దప్పు మల్లికార్జున్, చెండేటి వేణుగోపాల్ మాదిగ, బౌద్ధ నగర్ డివిజన్ అధ్యక్షుడు చల్లగూడెం దేవేందర్, దావా శివ ప్రసాద్, ఎడ్ల రుద్ర వినయ్, గోనె శ్రీనివాస్, గసగంటి విజయ్, కాశీనాథ్, శ్రీనివాస్, హోలీయ, రవి, బాబు రావు మాదిగ తదితరులు పాల్గొన్నారు

## నష్టపరిహారం చెల్లించాలనే సుప్రీం కోర్టు ఆలోచన అభినందనీయం

**తెలంగాణ అడ్వకేట్ జెఎసి కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి**

**ముషీరాబాద్, అక్టోబర్ 30, ప్రభాతవార్త:** ఒక నిర్దోషి శిక్షకు గురైతే, అతనికి నష్టపరిహారం చెల్లించాలని సుప్రీం కోర్టు ఆలోచన చేయటం అభినందనీయమని తెలంగాణ అడ్వకేట్ జేఏసీ కన్వీనర్ పులిగారి గో వర్ధన్‌రెడ్డి కొనియాడారు. గురువారం ఆయన కవాడిగూడలో విలేఖ రులతో మాట్లాడుతూ ఇప్పటి వరకు దేశంలోని పౌరులకు నష్టం, కష్టం, అగౌరవాలు కల్గినప్పుడు నష్టపరిహారాలు పొందేందుకు రాజ్యాం గం కల్పించిన వ్యవస్థలు ఉన్నాయికానీ, తప్పు చేయకుండా, తప్పుడు అభియోగాలతో శిక్షపడి, జైలు పాలైన వ్యక్తికి నష్టపరిహారం చెల్లించే వ్యవస్థ ఇప్పటి వరకు లేదని, అలాంటి వ్యక్తులకు నష్టపరిహారం చెల్లిం చే అంశాన్ని సుప్రీం కోర్టు పరిశీలించటం శుభపరిణామనని అన్నారు. ఒక పౌరుడిని వ్యవస్థ బలిపశువును చేసి, తప్పుడు సాక్ష్యాలతో శిక్ష పడేవిధంగా చేస్తే, ఆ వ్యక్తి నిర్దోషిగా బయటకు వచ్చినప్పటికీ, జైలులో అతను కోల్పోయిన విలువైన జీవితాన్ని పరిగణలోకి తీసుకుని, తగు మార్గదర్శకాలను రూపొందించాలని సుప్రీంకోర్టు యోచిస్తోం దని తెలిపారు. సుప్రీం బెంచ్ కోరినప్పుడు ప్రభుత్వం స్పందించి, ఒక వ్యవస్థను ఏర్పాటుచేయవలసిన అనివార్యత ఉన్నదని, ఆదిశగా ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటాయిన ఆశాభావం వ్యక్తం చేశారు.

## మైనారిటీ ఓట్ల కోసమే అజారుద్దీన్‌కు మంత్రి పదవి

**ముషీరాబాద్, అక్టోబరు 30, ప్రభాతవార్త:** మైనారిటీ ఓట్లు కోసమే అజారుద్దీన్‌కు మంత్రి పదవి ప్రకటించారని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయిబాబా ఆరోపించారు. గురువారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలలో పోటీ చేయటానికి పనికిరాదని ఎమ్మెల్సీ ఇచ్చి చేతులు దులుపుకున్న కాంగ్రెస్ పార్టీ, ఇప్పుడు ఎన్నికలలో లబ్ధిపొందాలనే ఉద్దేశంతో అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇస్తున్నారని విమర్శించారు. ఎమ్మెల్సీగా ఎన్నుకునే ప్రక్రియ పెండింగ్‌లో ఉన్నప్పటికీ, గవర్నర్ ఆమోదంరానప్పటికీ అజారుద్దీన్‌ను క్యాబినెట్లోకి తీసుకోవటం, మైనారిటీల ఓట్లు కొల్లగొట్టాలని ఆలోచన చేస్తున్నారని ఆరోపించారు. నిజంగా కాంగ్రెస్‌కు మైనారిటీలపై చిత్తశుద్ధి ఉంటే మాజీ మంత్రి, సీనియర్ నేత షబ్బీర్ అలీ ఉండగా, ఆయనను పక్కకు పెట్టి, ఇప్పుడు మైనారిటీలపై లేని ప్రేమను ఒలకబోస్తున్నారని, దీనిని మైనారిటీ నాయకులు గుర్తించాలని కోరారు.



ఆకునూరులో తడిసిన ధాన్యాన్ని ఎత్తుతున్న రైతులు

## వర్షానికి నేలకొరిగిన వరి పంట

**కన్నీరుమున్నీరవుతున్న అన్నదాతలు**

**చేర్యాల, అక్టోబరు 30, ప్రభాతవార్త :** మండలంలో బుధవారం కురిసిన వర్షానికి ఆయా గ్రామాల్లో వరి పంటలు పూర్తిగా నెలమట్టమయ్యాయి. మార్కెట్ యార్డుల్లోని ధాన్యం ఎక్కడికక్కడే తడిసి ముద్దయిపోయింది. కొనుగోలు కోసం తీసుకెళ్లిన పంటను త్వరగా కొనుగోలు చేయకపోవడంతో భారీ వర్షానికి కొట్టుకుపోయింది. వారం, పదిరోజుల్లో కోతలకు వచ్చిన పంటలు పూర్తిగా నేలకొరిగి గింజలు రాలిపోవడంతో ఏ మాత్రం అక్కరకు రాకుండా పోయిందని రైతులు కన్నీళ్ల పర్వతమయ్యారు.

**మార్కెట్ యార్డులో తడిసిన ధాన్యాన్ని పరిశీలించిన తహసీల్దార్...**

చేర్యాల వ్యవసాయ మార్కెట్ యార్డులో తడిసినధాన్యాన్ని తహసీల్దారు దిలీప్‌నాయక్ గురువారం పరిశీలించారు. మండల వ్యాప్తంగా నష్టపోయిన పంటలను పరిశీలించి నివేదికను పై అధికారులకు పంపిస్తామని చెప్పారు. అలాగే చేర్యాల మున్సిపల్ పరిధిలోని పలు ఇళ్లు, వీధుల్లోకి భారీగా నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గాంధీ సెంటర్ వద్ద జాతీయ రహదారిపై పెద్ద ఎత్తున నీరు నిల్వడంతో బుధవారం రాత్రి మున్సిపల్ అధికారులు, సిబ్బందితో పాటు పోలీస్‌లు వాహనాదారులకు, ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టారు.

## దెబ్బతిన్న పంటలను పరిశీలించిన వ్యవసాయాధికారులు

**హుస్నాబాద్ రూరల్, అక్టోబరు 30,ప్రభాతవార్త :** మొంథా తుఫాను కారణంగా హుస్నాబాద్ మండల పరిధిలోని దెబ్బతిన్న పంటలను గురు వారం వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రాథమిక అంచనా వేశారు. ఈ సందర్భంగా రైతులకు తగు సూచనలు చేశారు. వరి సాగు చేసిన రైతులు పొలం మడులలో నీరు నిల్వ ఉంచకుండా వరద కాలువల ద్వారా బయటికి పోయేలా ఏర్పాటు చేసుకోవాలని, వర్షం తగ్గాక కింద పడిన వరిని కట్టలుగా కట్టుకోవాలని తద్వార నీటిలో తడిచిన గింజ రంగు మారకుండా ఉంటుందన్నారు.కోతకు సిద్ధంగా ఉంటే లీటరు నీటిలో 5 శాతం ఉప్పు ద్రావణాన్ని కలిపి చల్లాలన్నారు. రైతులు పత్తి పంట పూత, పిందెలు ఉంటే నీరు లేకుండా చూడాలని, వర్షం తగ్గిన వెంటనే తడి పత్తి ఏరొద్దని, మొక్కలపైనే బాగా ఆరినతర్వాత తీయాలని వివరించారు. తీసిన పత్తిని పొడి ప్రదేశంలో పాలిథిన్ కవర్‌పైన ఆరబెట్టాలని సూచించారు. తడి పత్తిని నిల్వచేస్తే బూజు పట్టి రంగు మారి నాణ్యత దెబ్బతింటుందన్నారు. అధిక తేమ వల్ల పత్తి కాయలు కుళ్లిపోయి చూది రంగుమారి నాణ్యత దెబ్బతింటుందని తెలిపారు.దీని నివారణకు ప్రొపికొనజోల్ 200 మి.లీటర్ల మందును ఎకరానికి పిచికారీ చేయాలన్నారు. నల్లరేగడి నేలల్లో తేమ ఎక్కువ రోజులు నిలిచి కుళ్లిపోయే ప్రమాదముందని వర్షం నీటిని త్వరగా కాలువల ద్వారా బయటికి పంపించేయాలన్నారు.

**చిన్నకోడూరు మండలంలో...**



నష్టపోయిన పంటలను పరిశీలిస్తున్న అధికారులు

**చిన్నకోడూరు, అక్టోబరు 30,ప్రభాతవార్త :** మొంథా తుఫాన్‌తో కురిసిన భారీవర్షాలతో నష్టపోయిన పంటలను గురువారం తహశీల్దార్ ఎం.డి.సలీం మియా, వ్యవసాయధికారి జయంత్‌కుమార్ చిన్నకోడూరు, పెద్దకోడూరు తదితర గ్రామాలలో పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంట నష్టపోయిన రైతుల వివరాలను సేకరించి నష్టపరిహారం కోసం ప్రభుత్వానికి పంపించడం జరుగుతుందన్నారు. వరి, పత్తి పంటలకు తీరని నష్టం జరిగిందన్నారు,నష్టపోయిన పంటలకు నష్టపరిహారం అందేలా కృషి చేస్తామన్నారు. పంటలు పరిశీలించిన గ్రామాలలో 200 పైచిలుకు వరి పంటకు, మొక్కజొన్న, పత్తి పంటకు నష్టం జరిగిందన్నారు. వారి వెంట ఆర్ఐ మల్లికార్జున్, ఎవో యూనీస్, రైతులు తదితరులు ఉన్నారు.

## కార్తీక దీపోత్సవంలో భక్తుల సందడి



కార్తీకమాస పూజల్లో పాల్గొన్న భక్తులు

**వర్గల్, అక్టోబరు 30 (ప్రభాతవార్త):** వర్గల్ మండలంలోని నాచగిరి శ్రీ లక్ష్మీనృసింహ్మాస్వామి క్షేత్రంలో కార్తీకమాసంను పురస్కరించుకొని దేవాలయంలో నిర్వహిస్తున్న కార్తీక దీపోత్సవ కార్యక్రమం భక్తులతో సందడిగా మారింది. ఆలయ ప్రాంగణంలో వివిధ రూపాలలో దీపాలను వెలిగించి తమ భక్తిని చాటుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి విజయరామారావు తెలిపారు.



## బిహెచ్ఈఎల్‌లో స్వచ్ఛతా ర్యాలీ


బిహెచ్ఈఎల్‌లో స్వచ్ఛతా ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

**రామచంద్రాపురం, అక్టోబరు 30, ప్రభాతవార్త:**
హైద్రాబాద్, రామచంద్రాపురంలోని బిహెచ్ఈఎల్‌ల యాజమాన్యాల ఆద్వర్యంలో స్వచ్ఛతా పరిశుభ్రతలో భాగంగా గురువారం టౌన్‌షిప్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు కళాశాల నుంచి రాక్‌గార్డెన్ వరకు ర్యాలీనిర్వహించి రాక్‌గార్డెన్ వద్ద పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించారు. పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ నెల 31వ తేదీ వరకు కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ప్లాస్టిక్ వాడకంతో కలిగే అనర్థాలపై ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ సంధ్యాకర్, ఆయా విభాగాల అధికారులు, అద్యాపకులు, విద్యార్థులు, పట్టణప్రజలు పాల్గొన్నారు.

## కళాశాల యాజమాన్యాలను భయపెడితే సహించం

**-బిఆర్ఎస్వీ జిల్లా కో-ఆర్డినేటర్ రాజేందర్‌నాయక్**


విలేకరులతో మాట్లాడుతున్న రాజేందర్‌నాయక్

**సంగారెడ్డి టౌన్, అక్టోబరు 30, ప్రభాతవార్త:**
పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల స్కాలర్‌షిప్ రీయంబర్స్‌మెంట్ డబ్బులను విడుదలచేయకుండా విజిలెన్స్‌దాడులు నిర్వహిస్తూ కళాశాల యాజమాన్యాలను బెదిరిస్తే చూస్తూ ఊరుకోమని బిఆర్ఎస్వీ జిల్లా కో-ఆర్డినేటర్ రాజేందర్ నాయక్ హెచ్చరించారు. గురువారం జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో రాజేందర్ నాయక్ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల విద్యార్థుల జీవితాలతో కాంగ్రెస్ ప్రభుత్వం ఆడుకోవడం తగదన్నారు. విద్యార్థులకు బకాయి స్కాలర్‌షిప్ రీయంబర్స్‌మెంట్‌ను విడుదలచేసి తీరిగ్గా విజిలెన్స్‌తో దాడులునిర్వహిస్తే తమకేం అభ్యంతరంలేదని సూచించారు. విద్యాశాఖపై ఒకమారుకూడా సమీక్షించని విద్యాశాఖమంత్రి రేవంత్ రెడ్డికి విద్యార్థులపై ఉన్న ప్రేమాభిమానాలు చాటుతున్నాయన్నారు. విద్యార్థుల బంగారుభవిష్యత్తును దృష్టిలోపెట్టుకుని వెంటనే బకాయిపడ్డ స్కాలర్‌షిప్ రీయంబర్స్‌మెంట్‌లను విడుదలచేయాలని రాజేందర్‌నాయక్ డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో బిఆర్ఎస్వీ సంగారెడ్డి పట్టణ నాయకులు అఖిల్, అశోక్, రాజునాయక్, మోనుసింగ్ తదితరులు పాల్గొన్నారు.

## డిసిసిబి మేనేజర్‌ను సన్మానించిన కిరణ్‌రావు


ఎల్లంను సన్మానిస్తున్న ఎంబిఆర్ యూత్ అధ్యక్షులు కిరణ్‌రావు

**సిర్గాపూర్, అక్టోబరు 30, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన సిర్గాపూర్‌లోని డిసిసిబి బ్రాంచి మేనేజర్‌గా ఎల్లం గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు బ్రాంచి మేనేజర్‌గా విధులు నిర్వహించిన దీపక్ పాపన్నపేట మండలానికి బదిలీపై వెళ్లగా కొండపాక మండలం నుంచి ఎల్లం సిర్గాపూర్ మండలానికి బదిలీపై వచ్చి విధుల్లో చేరారు. మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎల్లంను ఎంబిఆర్ యూత్ అధ్యక్షులు కిరణ్‌రావు, సిర్గాపూర్‌గ్రామ యూత్ అధ్యక్షులు నర్సాగౌడ్, ఎస్టీసెల్ అధ్యక్షులు నారాయణనాయక్‌లు శాలువాతో సత్కరించారు.

## ఎంపిడిఓగా స్పందన దుర్గా బాధ్యతల స్వీకరణ

**-ఘనంగా సన్మానించిన అధికారులు, కార్యదర్శులు**



ఎంపిడిఓ స్పందన దుర్గాను సన్మానిస్తున్న అధికారులు, కార్యదర్శులు

**నాగల్‌గిద్ద, అక్టోబరు 30, ప్రభాతవార్త:**
మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా స్పందన దుర్గా గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల ప్రకటించిన గ్రూప్-1 పరీక్షల్లో ప్రతిభ చాటి ఎంపిడిఓగా ఉద్యోగం అందుకున్న స్పందన దుర్గా కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. మండలంలోని ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఎంపిఓ మహేశ్వరరావు, మండలపరిషత్ అధికారులు, సిబ్బంది శాలువాలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

## పత్తిపంట అమ్మకంపై రైతులకు అవగాహన


అవగాహన సదస్సులో పాల్గొన్న రైతులు

**మునిపల్లి, అక్టోబరు 30, ప్రభాతవార్త:**
భారతీయ పత్తి సంస్థ (సిసిఐ) వ్యవసాయ మార్కెట్ రాయికోడ్ ఆధ్వర్యంలో మునిపల్లి రైతు వేదికలో విజిలెన్స్ అవేర్నెస్ వీక్ 2025 కార్యక్రమం నిర్వహించడం జరిగింది. మండలంలోని రైతులకు పత్తి పంట అమ్మకంపై కొత్తగా వచ్చిన స్లాట్ బుకింగ్‌పైన పత్తి తేమ శాతం, గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ మంతూర్ సుధాకర్‌రెడ్డి, సీనియర్ కమర్షియల్ అధికారి వరుణ్ రఘువీర్, జెసిఈ శివానంద్, ఎఈఓ రహ్మాన్, శక్తివెల్ అధికారి తేజరెడ్డి, సీనియర్ నాయకులు సంగమేశ్వర్, నరేష్, విఠల్‌రెడ్డి, సురేష్, రాజు, రమేష్, మహేష్, ఖలీం పాషా తదితరులు పాల్గొన్నారు.

# కురిసిన వర్షం.. తడిసిన ధాన్యం..

**-కష్టాల్లో కర్షకులు**
**-మొలకెత్తిన ధాన్యంతో దిగాలుపడిన రైతులు**


తడిసిన ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతులు

**నారాయణఖేడ్, అక్టోబరు 30, ప్రభాతవార్త:**
గత రెండు మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షానికి నారాయణఖేడ్ నియోజకవర్గంలో అనేక చోట్ల రైతన్నలు వరికుప్పలు పోసి ఎండకు ఆర బెట్టారు. దీంతో అకాలవర్షం కురవడంతో అన్నదాతలు ఆరుగాలం కష్టనష్టాలకు ఓర్చి పండించిన పంట కాస్త తడిసిముద్దయింది. నియోజకవర్గంలోని కల్హేర్, సిర్గాపూర్, మనూర్, తదితర మండలాల్లో రహదారులపై ఆరబోసినవడ్లు తడిసిపోవడంతోపాటు కొన్ని దసరాకు కొట్టుకుపోయాయి. తుపానుప్రభావంతో అన్నదాతలు పండించినపంట ఆరబెట్టి కాంట చేద్దాం అనుకుంటే వరుణుడు మాత్రం కనికరించకపోవడంతో రైతన్నలు లబోదిబోమని మొత్తుకుంటున్నారు. ఇదిలా ఉండగా కోతకువచ్చిన వరి కొన్నిచోట్ల భారీవర్షం తాకిడికి మొత్తం నేలకొరిగిన ధాన్యాన్ని ఎలా కాపాడుకోవాలో తోచని స్థితి అన్నదాతలది. పంటపొలాల్లో నీరు నిండడంతో యంత్రాలకు డిమాండ్ పెరిగి అధికధరలు పెరుగుతున్నాయని పలువురు అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. వర్షానికి తడవకుండా కవర్స్ కప్పినా, ఫలితం లేకుండాపోవడంతో అన్నదాతలకు తిప్పలు తప్పడంలేదు. ఇప్పటికైనా అధికారులు, అటు ప్రభుత్వం స్పందించి తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

## న్యాల్‌కల్‌లో పడకేసిన పారిశుధ్యం

**-అనారోగ్యాలతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి**


మెయిన్‌రోడ్డు పక్కనే చెత్తాచెదారంలో పందుల స్వైరవిహారం దృశ్యం

**న్యాల్‌కల్, అక్టోబరు 30, ప్రభాతవార్త:**
అన్ని గ్రామాలకు ఆదర్శంగా ఉండాల్సిన మండల కేంద్రమైన న్యాల్‌కల్‌లో పారిశుధ్యం అధికారుల నిర్లక్ష్యంతో పడకేసింది. గ్రామంలోని మురుగు కాల్వలను పరిశుభ్రం చేసేవారు లేక, రోడ్డు పక్కనే పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించేవారు కరువవడంతో గ్రామంలో అపరిశుభ్రత నెలకొంది. మురుగు కాల్వలను నిత్యం శుభ్రం చేసేవారు కరువవడంతో ఈగలు, దోమలు, పందులు స్వైరవిహారం చేస్తుండంతో అటుగా ప్రయాణించే పరిస్థితి లేకపోవడంతోపాటు ప్రజలు అనారోగ్యానికి గురవుతూ ఆసుపత్రుల పాలవుతున్నారు. సబంధిత జిల్లా అధికారులు స్పందించి మండలకేంద్రం పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని గ్రామస్థులతోపాటు మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## వర్షానికి తడిసిన ధాన్యానికి ఉప్పు


వరిధాన్యంలో ఉప్పు జల్లుతున్న రైతు

**చిలిపిచెడ్, అక్టోబరు 30, ప్రభాతవార్త:**
మొంథా తుపాన్ ప్రభావంతో గత రెండురోజులుగా కురుస్తున్న వర్షానికి మెదక్‌జిల్లా చిలిపిచెడ్‌మండలం చండూర్‌గ్రామానికి చెందిన రైతు మహేశ్వర్ రెడ్డి 15ఎకరాలధాన్యం తడిచిపోవడంతో ధాన్యంకుప్పలల్లో రెండు క్వింటాళ్ల ఉప్పును చల్లితే మొలకలు రావని ఆయన ఉప్పునుచల్లారు.

## సహాయ వంటమనిషి ఉద్యోగ దరఖాస్తుకు ఆహ్వానం

**చిన్నశంకరంపేట, అక్టోబరు 30, ప్రభాతవార్త:**
చిన్నశంకరంపేట పట్టణంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో సహాయ వంట మనిషి ఉద్యోగం చేయడానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రత్యేక అధికారిణి గీతా గురువారం ఓప్రకటనలో తెలిపారు. దరఖాస్తులకు చిన్నశంకరంపేట మండలానికి చెందినవారు మాత్రమే అర్హులని, 10వ తరగతి పూర్తిచేసి ఉండాలన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తులను పాఠశాల కార్యాలయంలో 3వతేది సాయంత్రం 4గంటల్లోపు సమర్పించాలని తెలిపారు. దరఖాస్తుదారులు 18నుండి 45 సంవత్సరాలలోపు ఉండాలని, ఉద్యోగంలోచేరిన వారికి నెలకు రూ.9,750 వేతనం ఇవ్వనున్నట్లు అధికారిణి గీతా తెలిపారు.

## జాతీయ ఏకతా దినోత్సవం సందర్భంగా 2కె రన్

**-యువత పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలి: ఎస్ఐ బాలరాజు**

**రామాయంపేట మున్సిపాలిటీ, అక్టోబరు 30, ప్రభాతవార్త:**
సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా జాతీయ ఏకతా దినోత్సవాన్ని పురస్కరించుకొని రామాయంపేటలో 2కె రన్ నిర్వహించనున్నట్లు ఎస్సై బాలరాజు తెలిపారు. శుక్రవారం ఉదయం 6.30గంటలకు రామాయంపేట పోలీస్‌స్టేషన్ నుంచి మెదక్‌బ్రిడ్జ్ వరకు రన్ ప్రారంభమవుతుందని తెలిపారు. సమాజంలో ఐకమత్యం, దేశభక్తి భావాలను పెంపొందించడమే ఈ కార్యక్రమం లక్ష్యమని ఆయన చెప్పారు. యువత పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎస్సై బాలరాజు పిలుపునిచ్చారు. అధికారులు, పోలీసులు, స్థానిక ప్రజలు పాల్గొనే ఈ రన్ ద్వారా సర్దార్ వల్లభాయ్ పటేల్ త్యాగాలు, నాయకత్వాన్ని స్మరించనున్నట్లు ఎస్ఐ బాలరాజు పేర్కొన్నారు.

## అకాల వర్షం.. అన్నదాతల ఆక్రందన..


జంగరాయిలో కురిసిన వర్షానికి నేలకొరిగిన వరి పంట

**చిన్నశంకరంపేట, అక్టోబరు 30, ప్రభాతవార్త:**
ఆరుగాలంశ్రమించి పంటలు పండించిన రైతుల ఆశలను అకాలవర్షాలు ఆవిరి చేశాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో సంభవించిన మొంథా తుపాన్ ప్రభావంతో మండలవ్యాప్తంగా అన్నదాతలు ఆగమాగమవుతున్నారు. రెండురోజులుగా కురిసిన వానలకు అన్నదాత అల్లాడిపోతున్నాడు. రైతులు కొనుగోలుకేంద్రాలకు ధాన్యం తరలించాలని అనుకున్నప్పటి నుండి వానలు కురుస్తుండటంతో తూర్పారబెట్టిన ధాన్యం తడిసిముద్దైపోయింది. గురువారం మండలపరిధి జంగరాయిశివారులో ఈదురుగాలులు వీయడంతో వరిపంట ఒరిగిపోయింది. కష్టపడి పండించినపంట బూడిదపాలైందని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. అంబాజీపేట వద్ద ధాన్యాన్ని తూర్పారబెట్టగా వర్షాలు కురవడంతో ఎండినధాన్యం పూర్తిగా తడిసిపోయిందని రైతులు తెలిపారు. ప్రభుత్వం తడిసిన, రంగుమారిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

## హరీష్‌రావును పరామర్శించిన అప్పగారు


మాజీ మంత్రి హరీష్‌రావును పరామర్శిస్తున్న అప్పగారు

**ఝరాసంగం, అక్టోబరు 30, ప్రభాతవార్త:**
మాజీమంత్రి, సిద్దిపేట బిఆర్ఎస్ ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావును హైద్రాబాద్‌లోని ఆయన నివాసంలో మండలపరిధిలోని బర్దీపూర్ గ్రామంలోని దత్తగిరి ఆశ్రమ పీఠాధిపతి 1008 వైరాగ్యశిఖామణి అవధూతగిరి మహారాజ్ (అప్పగారు) పరామర్శించారు. మాజీమంత్రి హరీష్‌రావు తండ్రి తన్నీరు సత్యనారాయణరావు ఇటీవల మృతిచెందినట్లు తెలుసుకున్న అవధూతగిరి మహారాజ్ హైద్రాబాద్‌లోని హరీష్‌రావు నివాసానికిచేరుకుని సత్యనారాయణరావు చిత్రపటానికి నివాళులు అర్పించి హరీష్‌రావును, కుటుంబసభ్యులను పరామర్శించి సానుభూతి ప్రకటించారు.

## నేడు సిర్గాపూర్‌లో రాష్ట్రీయ ఏక్తా దివస్

**సిర్గాపూర్, అక్టోబరు 30, ప్రభాతవార్త:**
ఈనెల 31న ఏక్తా దివస్, రన్ ఫర్ యూనిటీ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ మహేష్ తెలిపారు. ఉదయం 8గంటలకు ప్రజల మధ్య ఐకమత్యం, సౌభ్రాతృత్వంతో సమగ్రతను పెంచేందుకు గ్రామంలోని మెయిన్ రోడ్డు నుంచి పోలీసుఠాణా వరకు రన్ ఫర్ యూనిటీ నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో యువకులు, విద్యార్థులు, ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎస్ఐ మహేష్ సూచించారు.

## నేడు న్యాల్‌కల్‌లో రన్ ఫర్ యూనిటీ

**-ఎస్ఐ దోమ సుజిత్**

**న్యాల్‌కల్, అక్టోబరు 30, ప్రభాతవార్త:**
సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకుని ఈ నెల 31న మండల కేంద్రమైన న్యాల్‌కల్‌లో రాష్ట్రీయ ఏక్తా దివస్‌ను నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ దోమ సుజిత్ తెలిపారు. న్యాల్‌కల్‌లోని బస్టాండ్ ఆవరణ నుంచి ఉదయం 9గంటలకు గ్రామశివారులోని తహసీల్దార్ కార్యాలయం వరకు పోలీసుల సమక్షంలో రన్ ఫర్ యూనిటీ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. గ్రామానికిచెందిన యువకులు, విద్యార్థులు, గ్రామస్థులు సామాజిక ఐకమత్యానికి ప్రతీకగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎస్ఐ దోమ సుజిత్ సూచించారు.

# రైతులకు లాభం చేకూర్చేందుకే కొనుగోలు కేంద్రాలు

**-దళారులకు అమ్మి నష్టపోవద్దు**
**-ఐకెపి డిస్ట్రిక్ ప్రాజెక్ట్ మేనేజర్ రమేష్‌బాబు**



మాసానిపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

**జోగిపేట, అక్టోబరు 30, ప్రభాతవార్త:**
2839 రైతులు దళారులను ఆశ్రయించి నష్టపోవద్దని, కొనుగోలుకేంద్రాల్లోనే తమ ధాన్యాన్ని అమ్ముకుంటే మద్దతుధర లభిస్తుందని ఐకెపి డిపిఎం రమేష్‌బాబు అన్నారు. గురువారం మండలపరిధిలో 12 గ్రామాల్లో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎట్టిపరిస్థితుల్లో రైతులు వేరేవారికి తమ ధాన్యాన్ని అమ్ముకోకూడదని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకుంటే రైతులకు లాభం చేకూరుతుందని ఆయన సూచించారు. ఇందులో ఫైన్ రకానికి రూ.2839లు ఇస్తున్నామని, అలాగే సన్నబియ్యానికి మరో ఐదువందల బోనస్ ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. రైతులకు డబ్బులుకూడా ఎలాంటి జాప్యంలేకుండా కేవలం 48గంటలలోపు వారిఖాతాల్లో జమచేయటం జరుగుతుందని తెలిపారు. మండలపరిధిలోని నాదులాపూర్, కన్‌సాన్‌పల్లి గ్రామాలలో పలుకారణాల నేపథ్యంలో కొనుగోలుకేంద్రాలు ప్రారంభించలేకపోయామని, త్వరలో వాటినికూడా ప్రారంభిస్తామని తెలిపారు. మండల పరిధిలోని సాయిబాన్‌పేట, మాసానిపల్లి, కోడెకల్, తాడ్మన్నూరు. నేరెడిగుంట, రాంసానిపల్లి, కిచ్చనపల్లి, దానంపల్లి, చింతకుంట, రోళ్లపాడు, మన్‌సాన్‌పల్లి, అన్నాసాగర్ గ్రామాల్లో కొనుగోలుకేంద్రాలు ప్రారంభించారు. అయితే రైతులు తమ ధాన్యాన్ని పొల్లులేకుండా తేమశాతం పదిహేడుకు మించకుండా ఎండబెట్టి తీసుకొని రావాలని వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఐకెపి ఎపిఎం దేవేందర్, సిసి లాయక్ ఆలి, వివోఎలు అంజమ్మ, మంజుల, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పి.నారాయణ, ఆత్మ కమిటీ డైరెక్టర్ పి.అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## స్కాలర్‌షిప్స్ వెంటనే విడుదల చేయాలి

**-ఎస్ఎఫ్ఐ బంద్**

**జోగిపేట, అక్టోబరు 30, ప్రభాతవార్త:**
పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్స్, ఫీజు రీయంబర్స్‌మెంట్ నిధుల విడుదలకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చేపట్టినబంద్ గురువారం జోగిపేటలో సంపూర్ణంగా జరిగింది. ఈసందర్భంగా ఎస్ఎఫ్ఐ అందోలు డివిజన్ అధ్యక్షులు గొల్ల శంకర్ మాట్లాడుతూ ఈనిధులు గత మూడు సంవత్సరాలుగా విడుదలచేయకపోవటంతో కళాశాలల్లో చదువుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇచ్చేందుకు యాజమాన్యాలు నిరాకరిస్తున్నాయని తెలిపారు. దీనివల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులుపడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తంచేశారు. తెలంగాణప్రభుత్వం పేదవిద్యార్థుల జీవితాలతో చెలగాట మాడుతుందని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వంస్పందించి వెంటనే నిధులు విడుదలచేయాలని ఆయన డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

## పోలీస్ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

**-ఎస్ఐ నర్సింలు ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ**


ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

**చిలిపిచెడ్, అక్టోబరు 30, ప్రభాతవార్త:**
విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని చిలిపిచెడ్ ఎస్ఐ నర్సింలు తెలిపారు. బుధవారం పోలీసు సంస్మరణదినోత్సవం సందర్భంగా చిలిపిచెడ్ మండలకేంద్రంలోని ప్రధాన రహదారిపై ఎస్ఐ నర్సింలు ఆధ్వర్యంలో గ్రామప్రజలతో కలిసి కొవ్వొత్తుల ర్యాలీని ఘనంగా నిర్వహించి పోలీసు అమరవీరులకు నివాళులు ఘటించారు.

## గాలికుంటు టీకాలతో ఆరోగ్యం..

**-జిల్లా పశువైద్యాధికారి వెంకటయ్య**


పశువులను పరీక్షిస్తున్న జిల్లా పశువైద్యాధికారి వెంకటయ్య

**రామాయంపేట మున్సిపాలిటీ, అక్టోబరు 30, ప్రభాతవార్త:**
పశువులకు ముందస్తుగా గాలికుంటు టీకాలు వేయించడం ద్వారా మంచి ఆరోగ్యంసిద్ధిస్తోందని జిల్లాపశువైద్యాధికారి వెంకటయ్య అన్నారు. రామాయంపేట మండలం ప్రగతి ధర్మారం, అక్కన్నపేటలో గురువారం ఉచిత గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమం నిర్వహించారు. ప్రగతి ధర్మారంలో జిల్లా పశువైద్యాధికారి ఆకస్మిక పర్యవేక్షణచేసి, టీకా రిజిస్టర్‌లను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడిపశువులకు ప్రభుత్వం ఉచితంగా అందించే టీకాలను రైతులు విధిగా వేయించుకోవాలని సూచించారు. జిల్లావ్యాప్తంగా వచ్చేనెల 14వరకు ఈటీకాల కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. టీకాలు వేయించుకోవడం రైతులు తమ బాధ్యతగా స్వీకరించాలని కోరారు. కార్యక్రమంలో లైవ్ స్టాక్ అసిస్టెంట్లు రాజు, శ్రీనివాస్, ఓఎస్ వెంకట్, గోపాలమిత్రలు ఎం.శ్రీనివాస్, యాదగిరి ఆయాగ్రామాల రైతులు ఉన్నారు.

## పాపన్నపేట డిసిసిబి మేనేజర్‌గా దీపక్‌కుమార్

**పాపన్నపేట, అక్టోబరు 30, ప్రభాతవార్త:**
పాపన్నపేట డిసిసిబి మేనేజర్‌గా బి.దీపక్‌కుమార్ గురువారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈయన సిర్గాపూర్ నుండి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన మేనేజర్ కిషన్ నారాయణఖేడ్‌కు బదిలీపై వెళ్లారు. ఈమేరకు దీపక్‌కుమార్ గురువారం బాధ్యతలు చేపట్టారు.

## ఆర్థిక సహాయం అందజేత

**చిన్నశంకరంపేట, అక్టోబరు 30, ప్రభాతవార్త:**
మండల పరిధి చందంపేటకు చెందిన బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఈశ్వరయ్య గత కొంతకాలంగా అనారోగ్యసమస్యతో బాధపడుతూ గురువారం మృతిచెందాడు. ఈవిషయం తెలుసుకున్న బిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కంఠారెడ్డి తిరుపతి రూ.5వేల ఆర్థికసహాయం పంపగా, బిఆర్ఎస్ నాయకులు స్వామి, రాజులు బాధిత కుటుంబానికి అందించారు.

## ప్రతిపేదవాడు సొంతగూడు కట్టుకోవాలని కల

**-మండల అధ్యక్షుడు పుట్ట నర్సింగరావు**


ఇందిరమ్మ ఇంట్లో గృహప్రవేశం చేసిన దృశ్యం

**గుమ్మడిదల, అక్టోబరు 30, ప్రభాతవార్త:**
కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాతకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ కార్యక్రమంలో భాగంగా, గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలో మిరియాల శకుంతల గృహప్రవేశ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొనడం జరిగింది. ఈసందర్భంగా మండలపార్టీ అధ్యక్షుడు పుట్ట నర్సింగరావు మాట్లాడుతూ, మిరియాల శకుంతలకు విడతలవారీగా నాలుగులక్షల రూపాయలు సకాలంలో మంజూరుచేయడం జరిగింది. మరోవిడత లక్షరూపాయలు మంజూరుకావలసి ఉంది. త్వరలో అవికూడా మంజూరు అవుతాయని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులు సకాలంలో ఇల్లు పూర్తిచేసుకొని ఇలాంటి మంచి అవకాశాలు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ప్రభుత్వం తరపున కోరుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పటాన్‌చెరు నియోజకవర్గం ఆత్మ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, ఉషాగోని గోవర్ధన్‌గౌడ్, పడమటి మహిపాల్‌రెడ్డి, ఆకుల ఆంజనేయులు, బాల్‌రాజ్‌యాదవ్, కిరణ్‌రెడ్డి, బేడ బుడగజంగం అధ్యక్షుడు అంజయ్య తదితరులు పాల్గొనడం జరిగింది.

## ఉప ఎన్నికల్లో సునీత గెలుపు ఖాయం

**ములుగు, అక్టోబరు 30, ప్రభాతవార్త:**
జూబ్లీహిల్స్‌లో జరుగనున్న ఉప ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మాగంటి సునీత గోపినాథ్ గెలుపు ఖాయమని ములుగు మండల మాజీ జెడ్‌పిటిసి జయమ్మ అర్జున్‌గౌడ్ అన్నారు. గురువారం జూబ్లీహిల్స్ పరిధిలోని ఎర్రగడ్డ డివిజన్‌లోగల రాజీవ్‌నగర్ 88వబూత్‌లో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి సునీతకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా జయమ్మ మాట్లాడుతూ జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని ప్రజల నుండి బిఆర్ఎస్ పార్టీకి మంచిస్పందన ఉందని అన్నారు. బిఆర్ఎస్‌పార్టీ చేసిన అభివృద్ధిని అక్కడి ప్రజలు గుర్తు చేసుకుంటున్నారని, మళ్ళీ బిఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తేనే అభివృద్ధిజరిగి ప్రజలకు మంచి జరుగుతుందని తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో గజ్వేల్ నియోజకవర్గ బిఆర్ఎస్‌పార్టీ సోషల్‌మీడియా ఇంచార్జ్ కొమ్ము నవీన్ కుమార్, ఎర్రవల్లి మాజీ సర్పంచ్ భాగ్య బాలరాజ్, సీనియర్ మహిళా నాయకురాలు అనిత, నాయకులు జి.బాబు తదితరులు పాల్గొన్నారు.